హైదరాబాద్ వార్త



# చెరువుల్లో మట్టిపోయడంపై హైడ్రా ఆగ్రహం

* అన్ని చెరువుల్లో ఫెన్సింగ్‌కు కమిషనర్ రంగనాథ్ ఆదేశం
* జూబ్లీహిల్స్‌లో పార్కు ఆక్రమణలను తొలగించిన హైడ్రా
* బుల్కాపూర్ నాలా పునరుద్ధరణకు చర్యలు



గండిపేటలోని హిమాయత్‌నగర్ వైపు చెరువులో మట్టి నింపిన ప్రాంతాలను పరిశీలిస్తున్న రంగనాథ్

**హైదరాబాద్, జనవరి 17,ప్రభాతవార్త:** చెరువుల ఎఫ్‌టిఎల్, బఫర్ పరిధిల్లో మట్టి పోయడాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సీరియస్‌గా పరిగణించారు. చెరువుల స్వరూపాన్ని మార్చివేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మట్టిపోసి నింపడానికి అవకాశం లేకుండా ఫెన్సింగ్ వేయాలని నిర్ణయించారు. అలాగే మట్టి ఎవరు పోసారో వాళ్లతోనే తీయించాలని.. వారిపై కేసులు పెట్టాలని కమిషనర్ ఆదేశించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ పరిధిలో మట్టిపోసి చెరువులను నింపుతున్నారని ఫిర్యాదుల నేపథ్యంలో తెల్లాపూర్‌లోని మేళ్లచెరువు, గండిపేట చెరువులను శనివారం హైడ్రా కమిషనర్ పరిశీలించారు. మెల్లచెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో మట్టి పోయడాన్ని స్థానికులు హైడ్రా కమిషనర్‌కు చూపించారు. చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ పరిధిలో పోసిన మట్టిని వెంటనే తొలగించాలని లేనిపక్షంలో చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే గండిపేట చెరువులో హిమాయత్‌నగర్ విలేజ్ వైపు మట్టి పోయడాన్ని హైడ్రా కమిషనర్ సీరియస్‌గా పరిగణించారు. వేసిన మట్టిని వెంటనే తొలగించాలని అక్కడ మట్టితో నింపిన డా. ఖుర్దీన్‌ను ఆదేశించారు. 48 గంటల్లో మట్టిని తొలగించకపోతే చర్యలుంటాయని హెచ్చరించారు. తమకు గడువు కావాలని కోరగా.. మరో 24గంటలు సమయాన్ని ఇచ్చారు. చెరువు స్వరూపాన్ని మార్చితే ఏ మాత్రం ఉపేక్షించమని హెచ్చరించారు.

**జూబ్లీహిల్స్‌లో పార్కు కబ్జాల తొలగింపు..**

జీహెచ్ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్ 36 పరిధిలోని రోడ్డు నంబరు 32లో రెండు ఎకరాలకు పైగా ఉన్న పార్కులో ఆక్రమణలను జీహెచ్ఎంసీతో కలిసి హైడ్రా తొలగించింది. పార్కు కబ్జాకు గురైందని.. అందులో అక్రమ కట్టడాలు వచ్చాయని మీడియాలో వచ్చిన వార్తల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ శనివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వెనువెంటనే ఆక్రమణలను తొలగించవలసిందిగా ఆదేశించారు. పార్కుకు ఆనుకుని ఉన్న రెండు ఇళ్లవారు.. వాచ్‌మ్యాన్‌కోసం, ఆవుల కోసం షెడ్లను వేయడాన్ని కమిషనర్ సీరియస్‌గా పరిగణించారు. పార్కులోకి గేట్లు పెట్టుకోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే గేట్లను తొలగించి ప్రహరీ నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన గేట్‌ను ఏర్పాటు చేసి ప్రజలందరూ పార్కును సందర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ ఆదేశాలతో వెంటనే ఆక్రమణలు తొలగించడం పట్ల అక్కడి స్థానికులు హర్షం వ్యక్తంచేశారు.

**బుల్కాపూర్ నాలాను పునరుద్ధరిస్తాం..**

హుస్సేన్ సాగర్‌కు మంచినీటిని తీసుకు వచ్చే చారిత్రక బుల్కాపూర్ నాలాను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని రంగనాథ్ అధికారులకు సూచించారు. మణికొండ ప్రాంతంలో బుల్కాపూర్ నాలా కబ్జాలకు గురౌతోందన్న ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ పరిశీలించారు. శంకరపల్లిలోని బుల్కాపూర్ చెరువునుంచి ఖానాపూర్, కోకాపేట, నార్సింగ్, పుప్పలగూడ, మణికొండ, దర్గా, షేక్‌పేట్, టోలిచౌకి, పోచమ్మబస్తీ, చింతలబస్తీ మీదుగా హుస్సేన్‌సాగర్‌కు వర్షపు నీరును తీసుకెళ్లే బుల్కాపూర్ నాలా పునరుద్ధరణతో చాలా ప్రాంతాలకు భూగర్భ జలాలు పెంపొందినట్లు అవుతుందని కమిషనర్ చెప్పారు. ఈ నాలా ఆవశ్యకతను దృష్టిలో పెట్టుకుని పునరుద్ధరించడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

# ‘లక్కీ డ్రా’లపై అప్రమత్తంగా ఉండాలి

## సిపి సజ్జనార్



సీపీ సజ్జనార్

**హైదరాబాద్, జనవరి 17 ప్రభాతవార్త**

ఇప్పుడు లక్కీడ్రాలపై నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ దృష్టిసారించారు. సోషల్ మీడియా క్రేజ్‌ను పెట్టుబడిగా మార్చుకుని, ‘లక్కీ డ్రా’ల పేరుతో అమాయకులను మోసం చేస్తున్న ఇన్‌ఫ్లు యెన్సర్లపై సజ్జనర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలాంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. కేవలం పాపులారిటీని అడ్డం పెట్టుకుని ప్రజల నుంచి డబ్బు దండుకుం టున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ‘ఎక్స్’ (ట్విటర్) వేదికగా ఆయన స్పందించారు. గతం లో బెట్టింగ్‌యాప్‌లను ప్రచారం చేసిన కొందరు, ఆ అక్రమ దందాకు అడ్డుకట్ట పడటంతో ఇప్పుడు ‘లక్కీ డ్రాల’ అవతారమెత్తారని సీపీ ధ్వజమెత్తారు. కార్లు, ఖరీదైన బైకులు, ఇళ్లు, డీజే సెట్లు బహుమతులుగా ఇస్తామంటూ ప్రజలకు ఎరవేసి, నిలువునా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. రీల్స్‌లో ఆర్భాటపు ప్రచారాలు చేస్తూ, వాస్తవం లో మోసాలకు పాల్పడుతున్న పలువురు ఇన్ ఫ్లుయెన్సర్ల వీడియోలను సజ్జనర్ ఎక్స్‌లో షేర్ చేశారు. ఇలాంటి మోసాలకు పాల్పడే వారిపై ‘ద ప్రైజ్ చిట్స్ అండ్ మనీ సర్క్యులేషన్ స్కీమ్స్ బ్యానింగ్ యాక్ట్ 1978‘ కింద కేసులు నమోదు చేస్తామని సజ్జనార్ స్పష్టం చేశారు. ఈ వ్యవ హారంలో వారు సినిమా సెలబ్రిటీలైనా, సోషల్ మీడియా స్టార్లైనా సరే.. చట్టపరమైన చర్యల నుంచి ఎవరూ తప్పించుకోలేరని తేల్చి చెప్పారు. లక్కీ డ్రాల పేరుతో ఎవరైనా మోసాలకు పాల్ప డుతున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారం అందిం చాలని ప్రజలను సీపీ కోరారు. ఇందుకోసం డయల్ 100కు గానీ, హైదరాబాద్ సిటీ పోలీస్ వాట్సా ప్ నెంబర్ 94906 16555కుగానీ వివ రాలు పంపించాలని సూచించారు. లేదా స్థానిక పోలీసులకు కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రలో భాలకు గురిచేసే మాయమాటలు నమ్మి మోస పోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

## కృష్ణానగర్‌లో ఇంట్లో పేలిన వాషింగ్ మిషన్

**జూబ్లీహిల్స్, జనవరి 17, ప్రభాతవార్త :** కొద్ది రోజుల కిందట అమీర్‌పేటలో ఒక ఇంట్లో వాషింగ్ మిషన్ పేలిన విషయాన్ని మరువక ముందే యూసుఫ్‌గూడ కృష్ణానగర్‌లో మరో ఇంట్లో వాషింగ్‌మిషన్ పేలింది. ఈ సంఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోలేదు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. కృష్ణానగర్‌లో ఒక ఇంటి రెండో అంతస్థులో ఒక న్యూస్ ఛానెల్‌లో సబ్‌ఎడిటర్‌గా పనిచేస్తున్న సాంబశివ రెడ్డి నివసిస్తున్నారు. శనివారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో ఇంట్లోని సామసంగ్ వాషింగ్ మిషన్‌ను ఆన్‌చేశారు. అయితే అది అసాధారణ శబ్దం చేస్తుండటంతోపాటు మోటర్ ఫెయిల్ అయింది. దీంతో షార్ట్‌సర్క్యూట్ అయి మంటలు చెలరేగి పొగలు వచ్చాయి. దీంతో ఇంట్లోని కుటుంబ సభ్యులు బయటకు వెళ్లగా కొద్ది సమయానికే వాషింగ్ మిషన్ మోటారు భాగంలో ఒక్కసారిగా పేలింది. వాషింగ్ మిషన్ పూర్తిగా ధ్వంసమైంది. టాప్‌లోడ్ వాషింగ్ మిషన్ కాస్త కుప్పగా మారిపోయింది. ఈ సంఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోలేదు. విషయం తెలుసుకున్న మధురానగర్ పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ద్విచక్ర వాహనదారుడిని ఢీకొట్టి ఈడ్చుకు వెళ్లిన కారు

**సైదాబాద్, జనవరి 17 ప్రభాతవార్త:** ద్విచక్ర వాహనదారుడిని ఢీకొట్టిన కారు ఆగకుండా వంద మీటర్లు ఈడ్చుకు వెళ్లిన సంఘటన సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. చంపాపేటలో జరిగిన ఈ హిట్ అండ్ రన్ స్థానికంగా కలకలం సృష్టించింది. వివరాలు ఇలా ఉన్నాయి. సైదాబాద్ నివాసి దేవరశెట్టి సునీల్ దిచక్ర వాహనంపై శనివారం తెల్లవారుఝామున ఇంటికి వెళ్తుండగా గ్రీన్ పార్క్ కాలనీ ఆర్చ్ సమీపంలో వెనక నుండి వేగంగా వచ్చిన కారు అతడి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి, దాదాపు వంద మీటర్ల దూరం ఈడ్చుకువెళ్లి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ఘటనలో సనీల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు అక్కడకు చేరుకున్నారు. గాయపడిన సునీల్‌ను ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. సిసిటివి ఫుటేజీల ఆధారంగా కారు వివరాలు సేకరించే పనిని చేపట్టారు.

## పెళ్లి పేరుతో నమ్మించాడు.. మోసం చేశాడు...

### మధురానగర్ ఠాణాలో కేసు నమోదు

**జూబ్లీహిల్స్, జనవరి 17, ప్రభాతవార్త :** పెళ్లి పేరుతో ఒక యువతికి దగ్గరై గర్భం దాల్చాక వద్దన్న ప్రబుద్ధుడిపై మధురానగర్ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది. మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో నమోదై కేసు వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. 2023లో ఒక యువతికి జహీరాబాద్‌కు చెందిన జాదవ్ శేఖర్‌నాయక్(32) ఫోన్‌కాల్స్ ద్వారా పరిచయమయ్యాడు. తనకు పెళ్లి కాలేదని ఆయా యువతిని నమ్మించి ఆమెకు దగ్గరయ్యాడు. నేరుగా ఆమెను కలుసుకొని ఆమెతో సన్నిహిత సంబంధం నెరిపాడు. గతేడాది డిసెంబరులో యూసుఫ్‌గూడ సమీపంలో జాదవ్ శేఖర్‌నాయక్ బంధువుల ఇంటికి యువతిని తీసుకెళ్లి వివాహం పేరుతో ఆమెకు దగ్గరై లైంగిక సంబంధం పెట్టుకున్నాడు. ఆలయంలో సింధూరం పెట్టి వివాహం చేసుకుంటానని నమ్మించాడు. పెళ్లికోసం కట్నం కావాలని కోరడమే కాకుండా రూ. 1.15 లక్షల విలువైన ఐఫోన్‌ను కట్నంగా ఇవ్వాలని సూచించాడు. ఈ క్రమంలోనే యువతి గర్భం దాల్చడంతో విషయం జాదవ్‌కు తెలియజేసింది. అప్పటినుంచి జాదవ్ యువతిని దూరం పెట్టడం ప్రారంభించాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఈ నేపథ్యంలోనే యువతి సంగారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు జీరో ఎఫ్ఐఆర్‌గా కేసు నమోదు చేసి మధురానగర్ ఠాణాకు బదిలీ చేశారు. ఈ మేరకు మధురానగర్ పోలీసులు జాదవ్ శేఖర్‌నాయక్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సంస్థ సొమ్ము సొంత ఖాతాలోకి..ఉద్యోగిపై కేసు నమోదు

**జూబ్లీహిల్స్, జనవరి 17, ప్రభాతవార్త :** పనిచేసే సంస్థకు చెందిన డబ్బులను తన సొంత ఖాతాలోకి మరల్చుకున్న ఒక ఉద్యోగిపై జూబ్లీహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 9లో ఉన్న ఫ్రీడం స్క్రీన్స్ ఇండియా ఎల్ఎల్‌పీ సంస్థలో శ్రీకాంత్‌రెడ్డి సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా చేరాడు. సంస్థకు చెందిన లావాదేవీలకు సంబంధించిన డబ్బుతోపాటు జీఎస్టీ డబ్బును సంస్థ ఖాతాలో జమచేయకుండా సొంత ఖాతాలోకి మరల్చుకున్నాడు. ఇటీవల విషయం తెలియడంతో సంస్థ యాజమాన్యం అతనిపై దృష్టి పెట్టింది. దీంతో దాదాపు రూ. 3లక్షల మేర మోసానికి పాల్పడినట్లు గుర్తించారు. సంస్థకు చెందిన ధృవ్‌పటేల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీకాంత్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సికింద్రాబాద్ అస్థిత్వాన్ని దెబ్బతీస్తున్న ప్రభుత్వం

### తలసాని సాయికిరణ్ యాదవ్

**కంటోన్మెంట్,జనవరి 17 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ అస్థిత్వాన్ని దెబ్బతీసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని సికింద్రాబాద్ పార్లమెంట్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి తలసాని సాయికిరణ్‌యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ మున్సిపాల్ కార్పొరేషన్ ఏర్పాటుకు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పిలుపుమేరకు శనివారం ఉదయం రైల్వే స్టేషన్ నుంచి శాంతి ర్యాలీకి సాయికిరణ్ యాదవ్ నల్లదుస్తులు ధరించి నల్ల బెలూన్‌లతో సికింద్రాబాద్ బచావో నినాదాలతో ఎంజిరోడ్డులోని గాంధీ విగ్రహంవద్దకు వెళ్తుండగా పోలీసులు అరెస్టు చేసి గోషామహల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తుండగా అక్రమంగా అరెస్టు చేసి పోలీసులు ర్యాలీని అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. సికింద్రాబాద్‌కు 220 సంవత్సరాల చరిత్ర కలిగిన సికింద్రాబాద్ అస్థిత్వం లేకుండా చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ఈ నెల 5వ తేదీన ర్యాలీకి అనుమతి కోరితే ఉద్దేశ పూర్వకంగా శుక్రవారం రాత్రి అనుమతిని పోలీసులు రిజక్ట్ చేయడం సరైందికాదన్నారు. అరెస్టలతో తమ ఉద్యమం ఆగదన్నారు.

# హాట్ ఎయిర్ బెలూన్లలో సాంకేతిక లోపం

* చెరువులో అత్యవసరంగా దిగిపోయిన బెలూన్ * భయాందోళన చెందిన బెలూన్‌లోని ప్రతినిధులు * కాపాడిన రెస్క్యూ సిబ్బంది




చెరువులో దిగిన హాట్ ఎయిర్ బెలూన్, పక్కన బెలూన్‌ను బయటకు తీసుకు వస్తున్న సిబ్బంది

**నార్సింగి, జనవరి 16 ప్రబాతవార్త :** తెలంగాణ పర్యాటకశాఖ ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన “హాట్ ఎయిర్ బెలూన్ రైడ్” పర్యాటకులను ఆందోళనకు గురిచేసింది. సాంకేతిక కారణంతో అనుకున్న ప్రాంతానికి చేరకుండానే మధ్యలో చెరువులో దిగిపోయింది. సకాలంలో రెస్క్యూటీం సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకోవడంతో ఆ బెలూన్‌లో ఉన్న వారికి ఎలాంటి ప్రాణాపాయం జరుగలేదు. మరో ఎయిర్ బెలూన్ నార్సింగి సర్కిల్ మంచి రేవులలో ఉన్న వేణుగోపాల స్వామి ఆలయం సమీపంలో దిగిపోయింది. ఇంకో బెలూన్ ఓ నిర్మాణం ప్రహరీలో దిగింది. ఈ మూడు సంఘటనల్లో బెలూన్లలో ఉన్న వారికి ఎవరికీ ఎలాంటి హాని జరుగలేదు. వారంతా సురక్షితంగా బయటకు వచ్చారు. దీంతో పర్యాటక శాఖ అధికారులు, బెలూన్ నిర్వాహణ సంస్థ ప్రతినిధులు ఊపిరి పీల్చుకున్నారు. సరదాగా ఆకాశ మార్గంలో పయనిస్తూ చారిత్రక ప్రదేశాలైన గోల్కొండకోట, సెవెన్‌టూంబ్స్, తారామతి, బారాదరి, గండిపేట చెరువు, ఔటర్ రింగ్‌రోడ్డు వంటివి చూసి మురిసిపోదామనుకుంటున్న పర్యాటకులలో ఈ సంఘటన భయాందోళనకు గురిచేసింది. దీంతో వారిలోని ఉత్సాహం కాస్త ఉసూరుమంది. చెరువులోని బురదలో కూరుకుపోయిన హాట్ ఎయిర్ బెలూన్‌లో ఇద్దరు మీడియా ప్రతినిధులు, ఒక కైట్ ఫెస్టివల్ నిర్వాహకుడు ఉన్నారు.

సంక్రాంతి సంబురాలలో భాగంగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గోల్కొండలోని గోల్ఫ్‌కోర్సు వద్ద “హాట్ ఎయిర్ బెలూన్ రైడ్ ఫెస్టివల్”ను ఘనంగా ప్రారంభించారు. హైదరాబాద్ ప్రజలను ఆకట్టుకునేందుకు వినూత్నరీతిలో ఈ హాట్‌బెలూన్ రైడ్‌ను ప్రవేశపెట్టారు. చారిత్రక గోల్కొండ కోట అందాలు, సెవెన్‌టూంబ్స్, గండిపేట, హిమాయత్‌సాగర్ చెరువు, ఔటర్ రింగ్‌రోడ్డు వంటివి గాల్లో ఉండి వీక్షించే ఏర్పాట్లు చేశారు. ఈ బెలూన్‌లను విదేశీయులు నడుపుతున్నారు. డెస్టినేషన్ తెలంగాణ అనే బ్రాండ్‌ను పెంచేందుకు ఈ వేడుకలను ప్రారంభించినట్లు మంత్రి ప్రకటించారు. పర్యాటక రంగంలో తెలంగాణను నెంబర్ వన్‌గా నిలిపేందుకు ఈ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నట్లు వివరించారు. సంక్రాంతికి హైదరాబాద్ ప్రజలు పతంగుల పండగలో మునిగి ఉండగా కొత్తగా ఏయిర్ బెలూన్ రైడ్ ఫెస్టివల్‌ను ఈ సంవత్సరమే ప్రారంభించారు. తొలిరోజు ఈ బెలూన్ షో పట్ల చాలా మంది పర్యాటకులు ఆకర్షితులై, వాటిలో వెళ్లి వచ్చారు. గోల్కొండ, నెక్‌నాంపూర్, నార్సింగి ప్రాంతాలలోని ప్రజలు ఆకాశంలో వరుసగా వెళ్తున్న బెలూన్లను చూసి, తమ మొబైల్ ఫోన్లలో వీడియోలుతీసి సంబ్రమాశ్చర్యాలకు గురయ్యారు. కానీ శనివారం వాతావరణం అనుకూలించకనో, సాంకేతిక లోపమో కానీ వరుసగా మూడు బెలూన్లు గమ్య స్థానాలకు చేరకుండా మధ్యలోనే కిందకు దిగిపోయాయి. దీంతో పర్యాటకులు ఈ బెలూన్ రైడ్ ప్రాణాపాయంగా మారుతుందని భయాందోళన చెందుతున్నారు. అధికారులు ఈ అంశంపై స్పందించి ఎలాంటి అంతరాయం కలగకుండా అనుకున్న లక్ష్యంను చేరేందుకు హాట్ ఏయిర్ బెలూన్‌లలో సాంకేతిక అంశాలను డెవలప్ చేసిన తరువాత పర్యాటకులను అనుమతించాలని, ఇప్పుడు అనుమతిస్తే ఏదైనా ప్రమాదం జరిగి ప్రజల ప్రాణాలు పోతే ఎవరు బాధ్యత తీసుకుంటారని? పైగా పర్యాటక రంగానికి చెడ్డపేరు వస్తుందన్నఅభిప్రాయాలు వయోజనులు వెలిబుచ్చుతున్నారు. ఈ అంశంపై రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులు ఓ సారి రివ్యూ చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# “మహిళ”కే జిహెచ్‌ఎంసి మేయర్

* రిజర్వేషన్ ఖరారు చేసిన ప్రభుత్వం
* ఫిబ్రవరి11న మూడు కార్పొరేషన్ల ప్రకటన
* ఆతర్వాత నూతన కార్పొరేషన్లకు రిజర్వేషన్
* అనంతరం మూడింటికి కలిపి ఎన్నికలు




**హైదరాబాద్, జనవరి 17,ప్రభాతవార్త:** రాష్ట్రంలో మున్సిపల్‌ఎన్నికలకు రంగం సిద్ధం అయింది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు ఇప్పటికే ఓటర్ల జాబితా విడుదల చేసిన ప్రభుత్వం తాజాగా ఆయా మున్సిపాలిటీలకు రిజర్వేషన్లు ఖరారు చేస్తూ శనివారం ప్రకటన చేసింది. ఈ నేపథ్యంలో గ్రేటర్‌హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జిహెచ్‌ఎంసి)కి జనరల్ మహిళ”కు కేటాయిస్తూ ప్రకటన చేసింది. అయితే జిహెచ్‌ఎంసికి రిజర్వేషన్లు ఖరారు చేసినప్పటికీ మున్సిపల్ ఎన్నికలతోపాటు జిహెచ్‌ఎంసి ఎన్నికలు జరిగేలా లేవు ఎందుకంటే జిహెచ్‌ఎంసిలో 20 మున్సిపాలిటీల 7 కార్పొరేషన్లను విలీనం చేసి మొత్తం 300 వార్డులుగా విభజించిన సంగతి తెలిసిందే. వీటికి సంబంధించి బౌండరీలు, జనాభా, ఓట్లు, రిజర్వేషన్లు, అన్నింటిని అధికారులు తయారు చేసినప్పటికీ ఫిబ్రవరి 10 తర్వాతే అధికారిక ప్రకటన వెలువడే అకావశం ఉంది. ప్రస్తుత పాలక మండలి గడువు ముగిసిన మరుసటి రోజే అంటే ఫిబ్రవరి 11న జిహెచ్‌ఎంసిని మూడుముక్కలుగా సైబరాబాద్, హైదరాబాద్,మల్కాజిగిరి కార్పొరేషన్లుగా విభజిస్తూ ప్రకటన చేసి.. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించిన అనంతరం మూడు కార్పొరేషన్లకు కలిపి ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తుంది.

**మూడు కార్పొరేషన్లు ఇవే..**

శంషాబాద్, రాజేంద్రనగర్, గోల్కొండ, చార్మినార్, సికింద్రాబాద్, ఖైరతాబాద్ జోన్ల పరిధిలో ఇటీవలే పునర్విభజించిన 150 మున్సిపల్ వార్డులతోకలిపి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జిహెచ్‌ఎంసి)గా, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి,కుత్బుల్లాపూర్ జోన్ల పరిధిలోని 74 మున్సిపల్ వార్డులను కలుపుకుని గ్రేటర్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌గా(జిసిఎంసి)గా అలాగే మల్కాజ్‌గిరి జోన్, ఉప్పల్, ఎల్బీనగర్ జోన్ల పరిధిలోని 76 మున్సిపల్ వార్డులతో గ్రేటర్ మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్(జిఎంఎంసి)గా ఏర్పాటు చేయనున్నారు. అయితే జిహెచ్‌ఎంసి పునర్విభజన ప్రతిపాదన సమయంలో సికింద్రాబాద్‌ను ప్రత్యేక మున్సిపల్ కార్పొరేషన్‌గా విభజించాలంటూ డిమాండ్లు తెరపైకి వచ్చినా దశాబ్దాలుగా హైదరాబాద్ జిల్లాలో అంతర్భాగంగా ఉన్న సికింద్రాబాద్‌ను అలాగే కొనసాగించాలని సర్కారు భావిస్తున్నట్లు సమాచారం.

**రిజర్వేషన్ల ప్రకటన అప్పుడే..**

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన రిజర్వేషన్లను ఖరారు చేసినట్లే.. గ్రేటర్ పరిధిలోని 300 వార్డులకు ఎస్సీ, ఎస్టీ బిసి రిజర్వేషన్లను ప్రకటించింది. 2011 జనాభా లెక్కలు, బీసీ డెడికేషన్ కమిషన్ రిపోర్ట్ ఆధారంగా జీహెచ్‌ఎంసీలోని 300వార్డులకు బీసీ, మహిళ, ఎస్సీ, ఎస్టీ, జనరల్ స్థానాలకు సంబంధించి రిజర్వేషన్లను ఫైనల్ చేసింది. మొత్తం వార్డుల్లో బీసీలకు ఏకంగా 122స్థానాలను కేటాయించగా. ఇందులో పురుషులకు 61, మహిళలకు 61 సీట్లను సరి సమానంగా కేటాయించారు. అలాగే 76 స్థానాలను మహిళలకు(జనరల్) ఇచ్చారు. ఎస్సీలకు 23 స్థానాలు కేటాయించగా ఇందులో పురుషులకు 12, మహిళలకు 11 స్థానాలు ఉన్నాయి. ఎస్టీలకు 5స్థానాలు కేటాయించగా, మగవారికి 3, స్త్రీలకు 2, అన్ రిజర్వ్‌డ్ 74 స్థానాలను ప్రకటించారు. అయితే ప్రకటించిన ఈ రిజర్వేషన్లు ఏ వార్డు ఏ రిజర్వేషన్ అన్నది కార్పొరేషన్ల విభజన తర్వాతే ప్రకటించనున్నారు.

# సికింద్రాబాద్ కేంద్రంగా మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సికింద్రాబాద్ క్లాసిక్ గార్డెన్‌లో జ్యోతి ప్రజ్వల చేస్తున్న కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, ఎంపీ ఈటెల తదితరులు

**కంటోన్మెంట్, జనవరి 17 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ కేంద్రంగా మున్సిపల్ కార్పొరేషన్ చేయాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం సికింద్రాబాద్ క్లాసిక్‌గార్డెన్‌లో నిర్వహించిన బిజెపి మున్సిపల్ ఎన్నికల సంకల్ప సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జంటనగరాల్లో సికింద్రాబాద్ ఎన్నో సంవత్సరాలుగా కేంద్రంగా ఉందన్నారు. అలాంటి పేరు లేకుండా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ చేయాలని ప్రభుత్వం పూనుకోవడం సరైంది కాదన్నారు. ఈ విషయంపై సిఎం రేవంత్‌రెడ్డి పునరాలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో బిజెపి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ ప్రజలతో పోరాటం చేస్తామన్నారు.

**ఏఆర్.రెహమాన్ వాఖ్యలు బాధకరం...**

మ్యూజిక్ డైరెక్టర్ ఏ.ఆర్.రెహమాన్ ఇటీవల చేసిన కామెంట్స్‌పై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పందించారు. తాను ముస్లిం కావడం వల్లే అవకాశాలు రాలేదు అనడం తప్పుడు కామెంట్స్ చేశారని పేర్కొన్నారు. తెలుగు, తమిళ్, కన్నడ, హిందీ భాషల్లో గొప్ప మ్యూజిక్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్న సందర్భం లో అభిమానులు ఆయనను ముస్లిమా ! హిందువా అని చూడలేదని, ఇప్పుడు ఎందుకు బేదాలు ఉంటాయని ప్రశ్నించారు. రెహమాన్‌లాంటి గొప్ప కళాకా రుడు చేయాల్సిన కామెంట్స్ ఇవి కావన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కంటోన్ మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మదమల్లికార్జున్‌తోపాటు వివిధ మున్సిపల్ కార్పొరేషన్లకు చెందిన బిజెపి నాయకులు పాల్గొన్నారు.

**సామాజిక ఉద్యమ కారుడు భాగ్యరెడ్డివర్మ...**

**గోషామహల్, జనవరి 17ప్రభాతవార్త:** సామాజిక ఉద్యమకారుడు, సంఘ సంస్కర్తగా ఎన్నో సామాజిక ఉద్యమాల్లో, సామాజిక చైతన్యం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి కేంద్ర బొగ్గుల గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. చాదర్‌ఘాట్‌లోని భాగ్యరెడ్డివర్మ మెమోరియల్ గ్లర్స్ హైస్కూల్ 83వ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను 1977 సంవత్సరంలో నేను వ్యక్తి గతంగా ఈ పరిసరా ప్రాంతంలో తిరిగినట్లు గుర్తు చేసుకున్నారు. అప్పుడే అది హిందు సోషల్ సర్వీస్ లీగ్ ఆద్వర్యంలో నడుస్తున్న భాగ్యరెడ్డి వర్మ మెమోరియల్ గ్లర్ హైస్కూల్ భవనాన్ని చూసినట్లు చెప్పారు. ఆన్ని సంవత్సరాల తరువాత స్కూల్ రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ స్కూల్ భవనం ఎన్నో సామాజిక ఉద్యమాలకు వేధిక అన్నారు. భాగ్యరెడ్డివర్మ రచించిన పుస్తకాలను చదవినట్లు చెప్పారు. 1910 ప్రాంతంలో సామాజిక ఉద్యమకారుడిగా సంఘ సంస్కర్తగా ఎన్నో సామాజిక ఉద్యమాల్లో పాల్గొన్నట్లు వివరించారు. దాంలో భాగంగానే పేదలకు, మహిళలు విద్య అందించాలనే ఉద్దేశ్యంతోనే అది హిందు సోషల్ సర్వీస్ లీగ్ అనే సంస్థను ప్రారంభించి స్కూల్‌లను నెలకొల్పినట్లు చెప్పారు. హైదరాబాద్ లోనే 26 సంస్థలను నెలకొల్పినట్లు చెప్పారు. న్యాయమూర్తులు, మేధా వుల మద్దతుతో అనేక సామాజిక కార్యక్రమాలు చేసినట్లు గుర్తు చేశారు. సామాజిక మార్పు కోసం ప్రారంభించిన ఇలాంటి విద్యా సంస్థల్ని కాపాడు కోవాల్సిన భాద్యత మనపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

## నిర్బంధాలతో ప్రజల ఆకాంక్షలను అడ్డుకోలేరు

### సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

**అడ్డగుట్ట, జనవరి 17 ప్రభాతవార్త:** నిర్బంధాలతో ప్రజల ఆకాంక్షలను అడ్డుకోలేరని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.సికింద్రాబాద్ అస్థిత్వాన్ని కాపాడేందుకు శనివారం తలపెట్టిన ర్యాలీకి పోలీసులు అనుమతించలేదు. మోండా మార్కెట్ టకార బస్తీలో నివాసం ఉంటున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌ను ముందు జాగ్రత్త చర్యగా ఆయన ఇంటి నుంచి వెళ్లకుండా పోలీసులు హౌజ్ అరెస్ట్‌చేశారు. దీంతో కార్పోరేటర్లు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పద్మారావుగౌడ్ నివాసానికి చేరుకొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంటనగరాల్లో సికింద్రాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. సికింద్రాబాద్ ఉనికిని చాటుకునేందుకు ఉద్యమిస్తామన్నారు. ర్యాలీకి అనుమతించకుండా కార్పోరేటర్లను, కార్యకర్తలను అడ్డుకోవడం, అరెస్టులు చేయడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించి ప్రజల ఆకాంక్షలను నిర్వీర్యం చేస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్న, బిఆర్ఎస్ నాయకులు నక్క మధు, లింగాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పేరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న హాట్‌బెలూన్ సందర్శనకు వచ్చిన ప్రజలు

# బహుజన రాజ్యాధికారమే ప్రధాన లక్ష్యం

## తెలంగాణ రాజకీయ కూటమి ప్రధాన కార్యదర్శి కపిలవాయి దిలీప్‌కుమార్


మాట్లాడుతున్న కపిలవాయి దిలీప్‌కుమార్

**ముషీరాబాద్, జనవరి 17, ప్రభాతవార్త:** బహుజన రాజ్యాధికారమే తెలంగాణ రాజకీయ కూటమి ప్రధాన లక్ష్యమని కూటమి ప్రధాన కార్యదర్శి కపిలవాయి దిలీప్‌కుమార్ స్పష్టం చేశారు. శనివారం కవాడిగూడలోని తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ కార్యాలయంలో తెలంగాణ రాజకీయ కూటమి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో కూటమితో కలసి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా దిలీప్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత బీఆర్ఎస్ మాదిరిగానే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమయిందని, వాటికి ప్రత్యామ్నాయంగా ఏర్పడిందే రాజకీయ కూటమి అని తెలిపారు. ఎన్నో ఉద్యమాలు, పోరాటాలతో, ఎందరో అమర వీరుల త్యాగాలతో సాధించుకున్న మన తెలంగాణ రాష్ట్రంను మనం కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. రాబోయే అన్ని ఎన్నికలలో రాజకీయ కూటమి పోటీలో ఉంటుందని, అన్ని కులాలకు, ప్రధానంగా యువతకు అవకాశం ఇచ్చి, అవినీతి రహిత రాజకీయాలకు శ్రీకారం చుడతామని అన్నారు. ఇప్పటికే తొమ్మిది పార్టీలు కూటమితో కలసి వచ్చాయని, అన్ని పార్టీలను కూటమిలోకి ఆహ్వానించి, రాబోయే రోజుల్లో ఒకపెద్ద రాజకీయ పార్టీగా తెలంగాణ రాజకీయ కూటమి విస్తరిస్తుందని తెలిపారు. కూటమి అధ్యక్షులు గాలి వినోద్‌కుమార్ మాట్లాడుతూ రాజకీయ కూటమి ద్వారానే ఎస్సీ ఎస్టీ బీసీలకు రాజకీయ అవకాశం సాధ్యమని, ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే మరిన్ని రాజకీయ పార్టీలు కూటమిలో చేరాల్సిన అవసరం ఉందని అన్నారు. భారత దేశంలో ఎక్కడా జరగని అవినీతి ధరణి పేరుతో తెలంగాణలో జరిగిందని, నీళ్లపై రాజకీయం చేస్తున్న ప్రభుత్వం, దీనిపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఆనాడు 24 లక్షల ఎకరాలు ఇందిరాగాంధీ పేదలకోసం ఇస్తే నేడు నాలుగు లక్షల ఎకరాలు మాత్రమే మిగిలిందని ఆరోపించారు. లక్షల కోట్లు అవినీతి జరిగితే, వాటిపై ఎందుకు కమిషన్ వేయలేదని ప్రశ్నించారు. అవినీతిలో అన్ని పార్టీలకు వాటా ఉందని, అందుకే అవినీతిపై ఎవరూ నోరు మెదపటం లేదన్నారు. అవినీతిలో కేసీఆర్, రేవంత్ రెడ్డి ఇద్దరూ కుమ్మక్కయ్యారని,దీనివల్ల బహుజనులు మాత్రమే నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మూడు ప్రధాన పార్టీలు విఫలమయ్యాయని, అందుకే నాలుగవ ప్రత్యామ్నాయ పార్టీగా, రాజకీయశక్తిగా, తెలంగాణ రాజకీయ కూటమి ఏర్పడిందని స్పష్టం చేశారు. ఇండియన్ క్రిస్టియన్ సెక్యులర్ పార్టీ ప్రధాన కార్యదర్శి డేవిడ్ ఆండ్రూ మాట్లాడుతూ క్రైస్తవులు రాజకీయాలలో భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని, చర్చిలపై దాడులు పెరిగిపోతున్న ఈ నేపథ్యంలో రాజకీయ శక్తితోనే వాటిని ఎదుర్కోగలమని తెలిపారు.

సమావేశంలో మహాజనసేన పార్టీ ఉపా ధ్యక్షులు తీగల ప్రదీప్‌గౌడ్, ఆధార్‌పార్టీ ఈసీ మెంబర్ డాక్టర్ ఈడ శేషగిరిరావు, బహుజన రాజ్యం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ లాలునాయక్ రామావత్, టీఆర్ ఎల్‌డి అధికార ప్రతినిధి గౌర బీరప్ప పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ముషీరాబాద్ శాసనసభ్యుడు ముఠా గోపాల్

### శాంతియుత ర్యాలీని అడ్డుకుని అరెస్టు చేయడం

## అప్రజాస్వామికం : ఎమ్మెల్యే ముఠా గోపాల్

**చిక్కడపల్లి, జనవరి 17(ప్రభాతవార్త) :** సికింద్రాబాద్ సాంస్కృతిక అస్తిత్వాన్ని కాపాడటానికి శాంతియుత ర్యాలీ నిర్వహిస్తుంటే అడ్డుకొని బిఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను అరెస్టు చేయడం అప్రజాస్వామికం అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సికింద్రాబాద్ బచావో పేరిట శాంతియుత ర్యాలీకి బయలుదేరిన టీఆర్ఎస్ యువ నాయకుడు జయసింహతోపాటు పలువురు టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలను అరెస్టు చేశారు. అనంతరం వారిని అంబర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి సంఘీభావంప్రకటించి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నియంతృత్వ పాలనను కొనసాగిస్తుందని మండిపడ్డారు. ఇందిరమ్మ పాలన అంటూ గొప్పలు చెప్పుకుంటూ శాంతియుతంగా ర్యాలీకి అవకాశం లేదా అని ప్రశ్నించారు. సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముఠా జైసింహ,డివిజన్ అధ్యక్షులు ఎం.రాకేష్‌కుమార్, వై.శ్రీనివాస్, శంకరముదిరాజ్, వల్లాల శ్యామ్ యాదవ్, కె.సురేందర్, కొండ శ్రీధర్‌రెడ్డి, మీడియా ఇంచార్జ్ ముచ్చుకుర్తి ప్రభాకర్, గోక నవీన్, ముదిగొండ మురళి, వెల్లంకి ఇంద్రసేనారెడ్డి, దీనదయాల్‌రెడ్డి, కార్యదర్శులు, సాయికృష్ణ, దామోదర్‌రెడ్డి, పోతుల శ్రీకాంత, అరుణ్‌కుమార్, శివముదిరాజ్, సుధాకర్, వి.శ్రీనివాస్‌యాదవ్, కేశవపురం అరుణ్, వల్లల్ రవి, రవి యాదవ్, బిక్షపతి, బొట్టు శీను, పాల్గొన్నారు.

### సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసేవరకు

## పోరాటం ఆగదు : పవన్‌కుమార్‌గౌడ్


ర్యాలీగా వెళ్తున్న లష్కర్ జిల్లాసాధన సమితి అధ్యక్షుడు తదితరులు

**కంటోన్మెంట్,జనవరి 17 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసేవరకు పోరాటాన్ని ఆపేదిలేదని లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ అన్నారు.సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, లష్కర్ జిల్లా ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి తలసాని ఇచ్చిన పిలుపుమేరకు శనివారం పవన్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో నల్ల జెండాలు చేతబూని, మెడలో నల్లకండువాలు వేసుకొని మోండా మార్కెట్ నుంచి బాట జనరల్‌బజార్ మీదుగా ర్యాలీగా వెళ్తుండగా పోలీసులు అనుమతి లేదని అడ్డుకున్నారు. దీంతో కొద్ది సేపు రోడ్డుపై బైటాయించి సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మోండా డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు ఆకుల హరిక్రిష్ణ, నాయకులు స్కైలాబ్‌యాదవ్, నాగులు, శ్రీహరి, కిషోర్, మహేశ్‌యాదవ్, హరీఫ్, నాగలక్ష్మి, సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### సికింద్రాబాద్‌ను మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డిని అరెస్టు చేస్తున్న పోలీసులు

**కంటోన్మెంట్, జనవరి 17 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేస్తూ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపుమేరకు శనివారం కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడినఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీకి వెళ్తుండగా పోలీసులు అడ్డుకొని అరెస్ట్‌చేశారు. కార్యక్రమంలో మాజీ బోర్డుసభ్యులు పాండు యాదవ్, లోకనాథం, నళిని కిరణ్, అనితా ప్రభాకర్ పాల్గొన్నారు.

### సికింద్రాబాద్ పేరును మారిస్తే సహించం : గజ్జెల నాగేశ్


కంటోన్మెంట్ నుంచి ర్యాలీగా తరలివెళ్తున్న గజ్జెల నాగేశ్ తదితరులు

**కంటోన్మెంట్, జనవరి 17 ప్రభాతవార్త:** 220 సంవత్సరాల చరిత్ర కలిగిన సికింద్రాబాద్ పేరును మారిస్తే సహించేది లేదని తెలంగాణ ఉద్యమ నేత గజ్జెల నాగేశ్ హెచ్చరించారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తలపెట్టిన శాంతి ర్యాలీలో పాల్గొనేందుకు శనివారం ఉదయం కంటోన్మెంట్ నుంచి తరలివెళ్తుండగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, బిఆర్ఎస్ నేతలు కిరణ్ కుమార్,పనస సంతోష్, గంగారామ్, కుమార్ ముదిరాజ్, మధురి తదితరులు పాల్గొన్నారు.

### బిఆర్ఎస్ నేతల అరెస్ట్

**చిక్కడపల్లి, జనవరి 17(ప్రభాతవార్త) :** సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలనీ డిమాండ్ చేస్తూ శనివారం రాంనగర్ చౌరస్తా వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న బిఆర్ఎస్ పార్టీ నేతలను అరెస్ట్‌చేసి వివిధ పోలీస్‌స్టేషన్‌లను తరలించారు. సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలనీ ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, యువనేత ముఠా జైసింహ పిలుపు మేరకు రాంనగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాంనగర్ చౌరస్తా నుండి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వరకు బయలుదేరిన నాయకులను పోలీసులు అరెస్ట్‌చేసి గాంధీనగర్, అంబర్‌పేట్, కాచిగూడ తదితర పోలీసుస్టేషన్‌లకు తరలించారు. అరెస్టయినవారు రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు శంకర్‌ముదిరాజ్, కార్యదర్శి మన్నె దామోదర్‌రెడ్డి. ముదిగొండ మురళి, గోక నవీన్, కేశవపురం అరుణ్, వెంకటకృష్ణ బబ్లు, కిషన్‌రావు, రమేష్‌రెడ్డి, కళ్యాణ్‌నాయక్, జి.శ్రీనివాస్, సిల్వర్ వెంకటేష్, దేవందర్ నాయక్, ప్రేమ్.రాజు. కృష్ణ. శ్రీనివాస్. ప్రవీణ్ తదితరులు ఉన్నారు.


బిఆర్ఎస్ నాయకులు గోక నవీన్ తదితరులను అరెస్ట్ చేసిన దృశ్యం

### అరెస్టులకు భయపడేది లేదు :బిఆర్ఎస్ నాయకులు

**తార్నాక, జనవరి 17 ప్రభాతవార్త :** సికింద్రాబాద్ అస్థిత్వం, ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటామని బిఆర్ఎస్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లో చేపట్టిన శాంతియుత ర్యాలీ నేపథ్యంలో పలువురుని పోలీసులు అరెస్టు చేసి ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు స్టేషన్‌లోనే వారిని బయటికి వెళ్లకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కనీసం మీడియా ప్రతినిధులను కూడా స్టేషన్లోనికి అనుమతి ఇవ్వలేదు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి క్లాక్ టవర్, ప్యాట్నీ, ప్యారడైజ్ సర్కిల్ మీదుగా ఎంజీ రోడ్డులోని గాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధమయ్యారు. ర్యాలీకి అనుమతి లేదని పోలీసులు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలను అడ్డుకొని అరెస్టు చేశారు. కొందరు అల్పా హోటల్‌కి వెళ్లడంతో పోలీసులు ఆల్ఫా హోటల్‌లోకి వెళ్లి అరెస్టు చేశారు.

**అరెస్టులపై బిఆర్ఎస్ ఆగ్రహం...**

ప్రజాస్వామ్యబద్ధంగా శాంతియుత నిరసన ర్యాలీ చేపడుతుంటే వేలాది సంఖ్యలో పోలీసులను మోహరించి.. అరెస్టులు చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. శాంతి ర్యాలీని అడ్డుకుని కాంగ్రెస్ పైశాచిక ఆనందం పొందుతుందని ఆరోపించారు. కానీ మళ్లీ కోర్టు నుంచి అనుమతులు తీసుకునైనా ర్యాలీ చేపడతామని టిఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ, నాయకులు జింకల మల్లేష్, గుండెల్లి మధుకర్, స్టాలిన్, సిహెచ్.సునిల్‌ముదిరాజ్, కూరెల్లి నాగరాజుగౌడ్, గీతా దయాకర్, సచిన్, లత, వరికుప్పల శ్యామ్,శంకర్ అంగడి బజార్, శివ.రూపాని రవి, రాజా, సాయికుమార్, సుగంద్ పాల్గొన్నారు.

### ప్రజలను తప్పుదారి పట్టించేందుకు బిఆర్ఎస్ యత్నం

#### కాంగ్రెస్ నాయకులు విశాల్‌సుధాం, త్రికాల

**బేగంపేట జనవరి 17,ప్రభాతవార్త :** శాంతి ర్యాలీ పేరు పెట్టి ప్లెక్సీలు మాత్రం బిఆర్ఎస్ నేతలవి ఏర్పాటుచేసుకుని సికింద్రాబాద్ ప్రజలను బీఆర్ఎస్ నేతలు తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని,సీనియర్ కాంగ్రెస్ నాయకులు విశాల్‌సుధాం, త్రికాల మనోజ్, పాండుగౌడ్, కృష్ణముదిరాజ్, నసీరుద్దీన్ బేగంపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు.ఇటీవల సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని మరికొందరు బీఆర్ఎస్ నేతలు సికింద్రాబాద్ పేరును లేకుండా చేస్తున్నారంటూ ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. సికింద్రాబాద్ లేకుండా చేస్తున్నారంటూ ప్రచారం చేస్తున్న బిఆర్ఎస్ నేతలు దానికి తగిన ఆధారాలు ఏమైనా ఉంటే చూపాలని,వారు డిమాండ్ చేసారు.తమ కుటుంబానికి సికింద్రాబాద్‌తో ఎంతో అనుబంధం ఉందని అలాంటి నిర్ణయం ఏమి జరగకున్నా,బీఆర్ఎస్ నేతలు మాత్రం సికింద్రాబాద్ పై అసత్య ప్రచారాన్ని చేస్తూ రాజకీయంగా వారి పబ్బం గడుపుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సికింద్రాబాద్‌కు అన్నివర్గాల మద్దతు తెలియజేస్తున్నాయని పేర్కొంటూ కేవలం బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన ఫ్లెక్సీలు వేసుకోవడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇలాంటి అసత్య ఆరోపణలు మానుకోవాలని వారు తెలియజేసారు. సమావేశంలో పాండుగౌడ్, కృష్ణముదిరాజ్, నసీరుద్దీన్(అడ్డు), చిరంజీవి, నారాయణ, శేఖర్, రాజేశ్, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

**రేవంత్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై తలసాని క్షమాపణలు చెప్పాలి**

ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల ముందుగా ఆయన క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ నాయకులు విశాల్‌సుధాం, త్రికాల మనోజ్‌కుమార్ తదితరులు డిమాండ్ చేసారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలను ప్రతి ఒక్కరు తప్పుబట్టినా ఇంతవరకు సీఎంకు ఆయన క్షమాపణ చెప్పకపోవడం ఆయన విజ్ఞతను తెలియజేస్తుందన్నారు. సిఎంకు తలసాని క్షమాపణలు చెప్పేవరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు నిర్వహిస్తునే ఉంటామని వారు తెలియజేసారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు విశాల్‌సుధాం, త్రికాలమనోజ్

### విద్యాసంస్థల్లో ప్రజాస్వామ్యం అమలుకు

## ఉద్యమాలను ఉధృతం చేయాలి

**చిక్కడపల్లి, జనవరి 17(ప్రభాతవార్త) :** దళిత బహుజన విద్యార్థులకు బలిపీఠాలుగా మారిన మారుతున్న ఉన్నత విద్యాసంస్థల్లో ప్రజాస్వామ్యం అమలు కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని వక్తలు అభిప్రాయపడ్డారు. శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయాల్లో కుల అణిచివేత విద్యార్థి ఉద్యమాలు రోహిత్ చట్టం ఆవశ్యకత అంశంపై రోహిత్ వేముల అమరత్వానికి 10 ఏళ్ల సందర్భంగా ఆల్ ఇండియా కన్వీనర్ బండారి లక్ష్మయ్య అధ్యక్షతన సెమినార్ జరిగింది. ప్రొఫెసర్ శ్రీనివాసులు మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలు సామాజిక సమస్యలను పరిష్కరించడానికి ప్రజాస్వామిక విలువలను సమాజంలో పెంపొందించడానికి నెలకొల్పబడ్డాయి. కానీ ఈనాటి పాలకులు విశ్వవిద్యాలయాలను నాశనం చేసి ప్రైవేటు కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. వి రఘునాథ్ మాట్లాడుతూ రోహిత్ వేముల సమస్యలను బాధిత దళిత బాధిత విద్యార్థులను నిందితులుగా మార్చడమే కాదు అసాంఘిక శక్తులుగా ముద్ర వేసి శిక్షించడానికి ఏర్పాట్లు చేస్తున్నారని అన్నారు. ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ప్రొఫెసర్ కెవై రత్నం, ప్రొఫెసర్ విజయ్, బండారు లక్ష్మయ్య మాట్లాడారు. ఈ సమావేశంలో కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జి సరోజన, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్ర మోహనకృష్ణ,కోశాధికారి జే చక్రవర్తి, దళిత ప్రజాసంఘాల నేతలు ప్రొఫెసర్లు మేధావులు తదితరులు పాల్గొన్నారు.

### పెన్షనర్ల సమస్యలపై సమావేశం ఏర్పాటు చేయాలి

#### తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ జెఎసి కోర్ కమిటీ చైర్మన్ లక్ష్మయ్య

**హైదరాబాద్, జనవరి 17 (ప్రభాతవార్త):** పెన్షనర్ల సమస్యలపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ జెఏసి కోర్ కమిటీ చైర్మన్ కె.లక్ష్మయ్య డిమాండ్ చేసారు. శనివారం జరిగిన సమావేశంలో లక్ష్మయ్య మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చూపుతున్న నిరక్ష్యవైఖరి, పెండింగ్ సమస్యల తీరుపై విస్తృత చర్చ జరిగింది. పెన్షనర్లకు 30 వాయిదాలలో ఏరియర్స్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించటం పట్ల నిరసన తెలుపుతూ వృద్ధులైన పెన్షనర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృష్ట్యా పెన్షనర్లకు ఒకే మొత్తంలో చెల్లించాలని, 2024 నుండి రిటైరైన పెన్షనర్లు ఆర్థిక ఇబ్బందులకు లోనుగుతూ, వైద్యానికి నిధులు లేక నేటికి 45 మంది మరణించటం జరిగిందని, వారందరికి వెంటనే పెన్షనరీ బెనిఫిట్స్ చెల్లించాలని సమావేశం తీర్మానించింది. పెన్షనర్లు అనేక అనారోగ్య సమస్యలు దుర్కొంటూ, ఆసుపత్రి ఖర్చులు భరించలేని స్థితిలోనున్నందున వెంటనే "ఆరోగ్య పథకం" క్యాష్ లెస్ ట్రీట్మెంట్ స్కీంను అమలు పరుస్తూ ఉత్తర్వులివ్వాలని ప్రభుత్వాన్ని సమావేశం కోరింది. రూ. 398 తో పనిచేసిన స్పెషల్ టీచర్స్ కు "నోషనల్ ఇంక్రిమెంట్లు" మంజూరు చేయాలని, పెన్షనర్ల సమస్యల పరిష్కారము కొరకు ప్రత్యేక "పెన్షనర్స్ డైరెక్టరేట్" ను ఏర్పాటు చేయాలని, పెన్షనర్ల సమస్యలపై ప్రత్యేక సమావేశము ఏర్పాటు చేసి చర్చించి పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరింది. ఈ సమావేశములో సెక్రెటరీ జనరల్ తులసి సత్యనారాయణ, కోచైర్మన్లు భరత్ రెడ్డి, రాజేంద్రబాబు, మోహన్ నారాయణ, సూర్యనారాయణ, ఆర్థిక కార్యదర్శి కృష్ణప్రసాద్, సభ్యులు జయప్రకాష్, జనార్థన్భట్, నరసరాజు పాల్గొన్నారు.

### ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే సురక్షిత ప్రయాణం

#### ఏసిపి ధనలక్ష్మి

**మెహిదీపట్నం, జనవరి 16, ప్రభాతవార్త :** వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ నడిపితేనే సురక్షితంగా గమ్యాలకు చేరుకుంటారని గోషామహల్ ట్రాఫిక్ ఏసిపి డి.ధనలక్ష్మి తెలిపారు. రోడ్డు భద్రత మాసంలో భాగంగా శనివారం ఆసిఫ్‌నగర్ ట్రాఫిక్ ఏసిపి ఎస్.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్ వివేకానంద చౌరస్తావద్ద వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. క్రమానికి ట్రాఫిక్ ఏసిపి డి.ధనలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే సురక్షితంగా గమ్యాలకు చేరుకోవడంతోపాటు ఇతర వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ముఖ్యంగా మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ ప్రమాదాలతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడంతోపాటు వాహనానికి సంబంధించిన పత్రాలు అన్ని ఉండాలన్నారు. కార్లు నడిపేవారు తప్పనిసరిగా సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఆసిఫ్ నగర్ ట్రాఫిక్ పోలీసులు, స్థానిక వాహనదారులు పాల్గొన్నారు.

## ఎన్వీఎస్‌రెడ్డికి రిటైర్డ్ రైల్వే ఆఫీసర్స్ 'అచీవర్స్ అవార్డు'


ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే ఆఫీసర్స్ అసోసియేషన్ సమావేశాన్ని ప్రారంభిస్తున్న ఎన్వీఎస్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 17 ప్రభాతవార్త**

ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (పట్టణ రవాణా) ఎన్వీఎస్ రెడ్డికి ప్రతిష్టాత్మకమైన 'అచీవర్స్ అవార్డు'ను ప్రదానం చేసింది. హైదరాబాద్ మెట్రో రైలు ఎండీగా, ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) విధానంలో ప్రపంచంలోనే అతిపెద్ద మెట్రో రైలు వ్యవస్థ నిర్మాణంలో ప్రేరణాత్మకమైన కృషి చేశారని పేర్కొంటూ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఎన్వీఎస్‌రెడ్డి చేసిన కృషిని అసోసియేషన్ ప్రశంసించింది. ప్రజా రవాణారంగంలో అందించిన సేవలకు గుర్తింపుగా అసోసియేషన్ తన "అచీవర్స్ క్లబ్"లో ఎన్వీఎస్ రెడ్డిని చేర్చుతున్నట్టు ప్రకటించింది. శనివారం సికింద్రాబాద్‌లో జరిగిన ఈ అవార్డు ప్రదానోత్సవం నుద్దేశించి ఎన్వీఎస్ రెడ్డి ప్రసంగించారు. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు చేపట్టడంలో ఎదురైన సవాళ్లు వాటిని అధిగమించిన తీరును ఆయన వివరించారు. ఇదొక బృహత్తర యజ్ఞంగా సాగిందని, ఎన్నో విజయగాథలు ఈ యాత్రలో ప్రేరణ కలిగించాయని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఈ ప్రయత్న ఫలితంగా, హైదరాబాద్ మెట్రో అంతర్జాతీయ గుర్తింపు పొందిందన్నారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఆయన హైదరాబాద్ మెట్రో రైలులో ఉన్న ప్రపంచస్థాయి సాంకేతికతలను, హైదరాబాద్ మెట్రోలో ప్రవేశపెట్టిన ఇంజనీరింగ్, ఆర్థిక ఆవిష్కరణలను వివరించారు. అనేక సున్నితమైన సమస్యలు,ఆందోళనలను ఆయన ఎలా నేర్పుగా ఎదుర్కొన్నారో వివరించారు. ఇది తరువాత ఐఎస్‌బి, స్టాన్‌ఫర్డ్, హార్వర్డ్‌వంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థల కేస్‌స్టడీస్‌గా మారిందని ఆయన తెలిపారు. భారతదేశంలోని 25కిపైగా నగరాల్లో అమలు జరుగుతున్న మెట్రో రైలు ప్రాజెక్టులకు రిటైర్డ్ రైల్వే అధికారుల అనుభవం, ఆ రంగంలో వారికున్న పరిజ్ఞానం చాలా ఉపయుక్తంగా ఉంటుందని ఆయన అన్నారు. వేగంగా విస్తరిస్తున్న మెట్రో రైలు రంగానికి వారి అనుభవాన్ని, నైపుణ్యాన్ని అందించడం ద్వారా జాతీయ వృద్ధికి దోహదపడాలని ఎన్వీఎస్ రెడ్డి సూచించారు. ఎస్.సి. రైల్వే రిటైర్డ్ అదనపు జనరల్ మేనేజర్ వి.ఎస్.శాస్త్రీ ఈ సభకు అధ్యక్షత వహించారు.అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వర్, ఎన్వీఎస్‌రెడ్డికి అచీవర్స్ అవార్డును ప్రదానం చేశారు.

### వీనులవిందుగా గజల్స్, సుఫీ సంగీతోత్సవం

**రవీంద్రభారతి, జనవరి 17 ప్రభాతవార్త :** ప్రముఖ హైదరాబాద్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తరణం పేరిట రవీంద్రభారతి ప్రధాన మందిరంలో జరిగిన గజల్స్, సుఫీ సంగీత ఉత్సవాలు ఆద్యంతం సభికులకు వీనులవిందు చేశాయి. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నండి విచ్చేసిన ప్రముఖ గాయకులు సుమధుర గళాలనుండి పెల్లుబికిన గజల్స్ గానమాధుర్యం ఆహుతులను సంగీతలోకంలో ఓలలాడించింది. ప్రముఖ గాయకులు శశాంక్ శేఖర్, డా. సురభి ఆర్యా, ప్రసన్నజోషి, అంతర్జాతీయ గాయకులు నమిసొదాఘర్, జ్యోతి సిస్టర్లు, సుఫీ గాయకులు సొహైల్‌ఖాన్ తదితరులు గజల్స్ గీతాలను గొప్పగా సంధించి సందేశాత్మక గేయాలతో మైమరపించారు. శ్రావ్యమైన స్వరాలతో వెల్లువైన గజల్స్ సాయంసంధ్యావేళ గజల్స్ ప్రియులను ఉత్సాహ ఉల్లాసభరితుల్ని కావించాయి. ఈ ఉత్సవాలకు సంగీత దర్శకులు రమావతార్ దయామ, షౌకత్‌అలీ సుఫీ, మాసీఖాన్, ఉస్తాద్ రతన్‌లాల్‌శర్మలు అతిథులుగా హాజరై గాయకులను ఎంతోగానో అభినందించారు. హైదరాబాద్ ఆర్ట్స్ కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి సర్వత్‌అలీ సభకు స్వాగతం పలికి సమన్వయపరిచారు.

### దివ్యాంగులకు ఐదు శాతం డివిజన్లను కేటాయించండి


జిహెచ్ఎంసి కమిషనర్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న నాగేశ్వరరావు

**చిక్కడపల్లి, జనవరి 17(ప్రభాతవార్త) :** జిహెచ్ఎంసి పరిధిలో 300 డివిజన్‌లలో దివ్యాంగులకు ఐదుశాతం డివిజన్లను కేటాయించాలని అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షులు కొల్లి నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఆయన శనివారం జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. జిహెచ్ఎంసిలో ఖాళీగాఉన్న ఉద్యోగాలను, వికలాంగులకు ప్రత్యేక సంక్షేమ కార్యక్రమాలు నిధులు కేటాయించాలని కోరారు. వెంటనే ఈ విషయంలో ప్రత్యేక దృష్టిని సారించి సానుకూలమైన నిర్ణయాన్ని తీసుకోవాలని కోరారు. పరిశీలిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారని కొల్లి నేశ్వర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో గ్రేటర్ నాయకులు జంగిలి శ్రీనివాస్, గుండె సుదర్శన్, సిరిగిరి ప్రసాద్ పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**చిక్కడపల్లి, జనవరి 17(ప్రభాతవార్త):** ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ఉన్న అనుభూతి మరెందులో ఉండదని యూకే ఫౌండేషన్ చైర్మన్, తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గారే వెంకటేష్ మాదిగ అన్నారు. శనివారం వరంగల్ జిల్లా రాయపర్తిలోని అంబేద్కర్ కాలనికి చెందిన ఐత దాసుబాబు కుమారుడు ఐత భగవాన్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఆయన చిత్రపటానికి గారే వెంకటేష్ మాదిగ పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రూ. 3000ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో యూకే ఫౌండేషన్ సభ్యులు గారే సందీప్, ఐత సాయిలు, ఐత యాకయ్య, ఐత కుమార్, ఐత సంపత్, తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఎన్‌టిఆర్ 30వ వర్ధంతి

**బేగంపేట జనవరి 17, ప్రభాతవార్త :** మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 30వ వర్ధంతి సందర్భంగా బేగంపేట రసూల్‌పురా జంక్షన్‌లోని ఎన్‌టిఆర్ విగ్రహం నుంచి ఎన్‌టిఆర్ ఘాట్‌వరకు అఖిల భారత ఎన్‌టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షులు శ్రీపతిసతీష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. అఖిల భారత ఎన్‌టీఆర్ అభిమాన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు దివంగత శ్రీపతి రాజేశ్వరరావు మొదలుపెట్టిన ఈ అమరజ్యోతి ర్యాలీ అప్పటి నుంచి ప్రతి ఏటా రసూల్‌పురా జంక్షన్‌లోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద ప్రారంభమై ఘాట్‌వరకు నిర్వహిస్తారు. ఆదివారం జరగనున్న ఈ ర్యాలీని ఎన్‌టీఆర్ విగ్రహంవద్ద ఎన్‌టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బక్కని నర్సింహులు, అరవింద్ కుమార్‌గౌడ్, నందమూరి సుహాసిని, కాట్రగడ్డ ప్రసూన, తదితరులు పాల్గొననున్నట్లు శ్రీపతి సతీష్‌కుమార్ తెలియజేసారు.

### విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

**బేగంపేట జనవరి 17,ప్రభాతవార్త :** పౌష్టిక ఆహారం తీసుకోవడం వల్ల విద్యార్థుల శారీరక ఎదుగుదలకు దోహదపడుతుందని మోండా మార్కెట్ సీఐ రాంచందర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం ఎన్నో పోషక విలువలు కలిగిన పౌష్టికాహారం అని తెలియజేసారు. ప్రభుత్వ ఆదెయ్య మెమోరియల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సీఐ స్టీలు ప్లేట్లను పంపిణీ చేసారు. విద్యార్థులు పాఠశాలకు రాకుండా ఇంటి వద్ద ఉంటే మొబైల్ ఫోన్లు చూస్తూ కంటి సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందని, అలాగే చెడు సహవాసాలకు అలవాటు పడే ఆస్కారం ఉందని అలాకాకుండా ఉండాలంటే ప్రతి తల్లిదండ్రులు వారి కుమారుడు, కుమార్తెలను పాఠశాలకు క్రమం తప్పకుండా పంపాలని సీఐ కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలజీ, భవానీ, జీహెచ్ఎంసీ సూపర్‌వైజర్ సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

## ఒకేరోజు మూడుచోట్ల చైన్‌స్నాచింగ్‌లు

### నాగోలు, చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో చైన్ స్నాచింగ్

### ద్విచక్ర వాహనంపై వచ్చి చోరీకి పాల్పడిన ఇద్దరు యువకులు

### మొత్తం ఐదు తులాల బంగారం చోరీ

**ఎల్.బి.నగర్, జనవరి 17 ప్రభాతవార్త:** సంక్రాంతి పండుగ వేడుకల్లో ప్రజలు మునిగి తేలుతుండగా మరి కొందరు దింగతనానికి పాల్పడుతూ వారి చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. ఒకేరోజు మూడుచోట్ల గుర్తు తెలియని వ్యక్తులు చైన్ స్నాచింగ్ లకు పాల్పడ్డారు.మహిళల మెడలోని బంగారు గొలుసులను గుర్తుతెలియని దుండగులు లాక్కెళ్లారు. ఈ సంఘటనలు నాగోల్, చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో చోటు చేసుకున్నాయి. నాగోల్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్‌జానీ కథనం ప్రకారం..నాగోల్ డివిజన్ బ్లైండ్స్‌కాలనీకి చెందిన మారగోని మాణెమ్మ(58) శనివారం ఉదయం 10 గంటల సమయంలో రాజ్యలక్ష్మికాలనీలో నివాసం ఉండే పెద్ద కుమారుడు ప్రమోద్ నివాసానికి నడుచుకుంటూ వెళ్తుండగా అతని ఇంటికిసమీపంలో గుర్తు తెలియని ఇద్దరు యువకులు మోటార్ సైకిల్‌పై వెనుక నుండి వచ్చి ఆమె మెడలోని రెండున్నర తులాల బంగారు మంగళసూత్రం(పుస్తెలతాడు)ను లాక్కొని పారిపోయారు.గొలుసును లాక్కున్న నిందితులు రాజ్యలక్ష్మికాలనీ నుండి నాగోల్ మెయిన్‌రోడ్ వైపు పారిపోయినట్లు తెలిపారు. నిందితుల వయస్సు 20 నుండి 25 సంవత్సరాల మధ్య ఉంటుందని తెలిపారు. మోటార్ సైకిల్ నడిపిన వ్యక్తి నల్లషర్టు, నల్ల ప్యాంటు ధరించి ఉండగా, వెనుక కూర్చున్న వ్యక్తి నల్లషర్టు, తెల్లప్యాంటు ధరించి, ఎరుపు రంగు కాలేజ్ బ్యాగ్ మోసుకొని ఉన్నాడని వివరించారు. మళ్లీ చూసిన పక్షంలో నిందితులను గుర్తుపట్టగలమని మణెమ్మ తెలిపారు. ఈ సంఘటనలో ఆమెకు ఎటువంటి గాయాలు కాలేదన్నారు. బంగారు గొలుసుకు సంబంధించి మణెమ్మ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మణెమ్మ కొడుకు మల్కాజ్గిరి కమిషనరేట్లో ఎస్సైగా బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు ఇన్స్పెక్టర్ మగ్బూజాని తెలిపారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారనీయాలని విజ్ఞప్తి చేశారు.

**చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో...**

నడుచుకుంటూ వెళ్తున్న ఇద్దరు మహిళల గొలుసులను గుర్తుతెలియని దుండగులు లాకెళ్ళారు. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ సైదులు కథనం ప్రకారం ఆర్కేపురం డివిజన్ ఆర్కే పురంకాలనీ రోడ్‌నెంబర్ 2లో నివాసం ఉండే ఆదిలక్ష్మి (40) దేవాలయానికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి తన మెడలోని ఒకటిన్నర తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. అదేవిధంగా కొత్తపేట న్యూ మారుతి నగర్‌లో మరో సంఘటన చోటుచేసుకుంది. మారుతినగర్‌కి చెందిన పద్మ (72) నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. బాధితులు రాజ్యలక్ష్మి, పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్స్పెక్టర్ సైదులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుల కోసం ముమ్మరంగా గాలిస్తున్నట్లు తెలిపారు. నాగోల్ ఎల్బీనగర్ చైతన్యపురి పోలీసులు దింగతనానికి పాల్పడ్డ వారికోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలను ప్రారంభించామన్నారు.


ఈటలకుకు వినతిపత్రం సమర్పిస్తున్నట్లు ఆదిత్యాముదిరాజ్ తదితరులు

## భగత్‌సింగ్‌నగర్ ప్రజల సమస్యలు పరిష్కరించాలి

**కుత్బుల్లాపూర్, జనవరి 17 ప్రభాతవార్త :** చింతల్ భగత్‌సింగ్‌నగర్ ప్రజలు సుదీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న మెయిన్‌రోడ్డు నిర్మాణంతోపాటు పలు సమస్యల పరిష్కారానికి తక్షణం చొరవ చూపాలని కోరుతూ భారతీయ జనతాయువమోర్చ చింతల్ డివిజన్ అధ్యక్షులు కోడి ఆదిత్య విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శనివారం మల్కాజ్‌గిరి లోక్‌సభ సభ్యులు ఈటల రాజేందర్‌కు బస్తీవాసులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్‌సింగ్‌నగర్ మెయిన్‌రోడ్ 1 నిర్మాణం, శ్మశానవాటిక అభివృద్ధిపనులు, ఆధునిక ఓపెన్‌జిమ్ ఏర్పాటు, స్వాతి మెడికల్ హాల్ నుంచి శ్మశానవాటిక వరకు 30 ఫీట్ల రోడ్డు నిర్మాణాన్ని తక్షణం అమలుచేయాలని ఆయన బస్తీవాసులతోకలిసి ఈటెల రాజేందర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ బస్తీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు శ్రీనివాస్, లింగయ్య, రాజేందర్, ప్రవీణ్, శివ, రిషి, ప్రధానకార్యదర్శి రామకృష్ణ, పురుశోత్తమ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలి

### జిహెచ్‌ఎంసి జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి


నాలా నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

**చాంద్రాయణగుట్ట, జనవరి 17, ప్రభాతవార్త :** అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసి చార్మినార్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. శనివారం జోన్ ఇంజనీరింగ్ ఎస్ఈ ఇందిరా, ప్రాజెక్ట్స్ ఎస్ఈ గోపాల్, ఎస్‌డబ్ల్యూఎం డిఇ వెంకటరాజు, ఇతర అధికారులతో కలిసి సంతోష్‌నగర్, యాకుత్‌పురా సర్కిళ్లలోని సంతోష్‌నగర్, ఐఎస్‌సదన్, డబీర్‌పురా, ఫర్హత్ నగర్, యాకుత్‌పురా, గంగానగర్ నాలా, మౌలాకా చిల్లా, సైదాబాద్ దోభీ ఘాట్ తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా జెడ్‌సి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు. యాకుత్‌పురా గంగానగర్ నాలా పనులు చివరి దశకు చేరుకున్నాయన్నారు. పారిశుధ్య నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సైదాబాద్ దోభిఘాట్‌లో యాకుత్‌పురా, సంతోష్ నగర్‌లో ఆయా సర్కిళ్లకు సంబంధించిన నూతన భవన నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. జోన్‌లోని అన్ని ప్రాంతాలలో పర్యటించి ప్రజా సమస్యలపై తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

## సిపిఆర్‌పై అవగాహన పెంచుకోవాలి

### రవాణాశాఖ జాయింట్ కమిషనర్ రమేష్



మాట్లాడుతున్న జాయింట్ కమిషనర్ రమేష్

**జూబ్లీహిల్స్, జనవరి 17, ప్రభాతవార్త :** ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో జాన్ అంబులెన్స్ ఆధ్వర్యంలో శనివారం గుండెపోటు సంభవించినప్పుడు ప్రాథమిక చికిత్సగా చేయాల్సిన సీపీఆర్ విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రథమ చికిత్స, సీపీఆర్ విధానం, కార్డియాక్ అరెస్ట్, గుండెపోటు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జాన్ అంబులెన్స్‌కు చెందిన డాక్టర్ మహమ్మద్ ముషిన్ వివరించారు. అనంతరం రవాణాశాఖ జాయింట్ కమిషనర్ సి.రమేష్ మాట్లాడుతూ.. సీపీఆర్ అనేది ప్రాణాలను కాపాడే అద్భుతమైన ప్రక్రియ అన్నారు. ఈ విధానం గురించి ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తాద్వారా ఎంతో మంది ప్రాణాలను కాపాడే అవకాశం దక్కుతుందన్నారు. ప్రాథమికంగా అందించాల్సిన చికిత్స గురించి తెలుసుకోవడం వల్ల చాలా మంది జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. కార్యక్రమంలో గుడ్ సంటరిన్ ప్రతినిధి రాహ్‌వీర్, ఆర్టీఓ పురుషోత్తంరెడ్డి, సి.పి. వెంకటేశ్వర రావు, సీహెచ్ సత్యనారాయణ, మాందాడి సురేష్‌రెడ్డి, నరేంద్ర నాయక్, విద్యా, శశిధర తదితరులు పాల్గొన్నారు.

## వారాంతపు సంతలతో వాహనదారుల ఇబ్బందులు

**కుత్బుల్లాపూర్, జనవరి 17 ప్రభాతవార్త:** వారంతపు సంతలతో ప్రధాన రహదారులపై వాహనదారుల ఇబ్బందులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని స్వచ్ఛంద సంస్థ నాయకులు, పర్యావరణవేత్త కోలా రవిందర్ ముదిరాజ్ విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు మేడ్చల్ ట్రాఫిక్ ఎసిపి వెంకట్‌రెడ్డికి ఆయన లిఖితపూర్వక వినతిపత్రాన్ని సమర్పించారు. సంత నిర్వాహకులపై ట్రాఫిక్ రద్దీపై ప్రత్యేక సూచనలు, సలహాలను అందిస్తూనే నేటి యువత సైలెన్సర్లను తొలగించి బైక్‌లను నడుపుతూ శబ్ద, వాయు కాలుష్యానికి కారణమవుతున్నారని ఇలాంటివారిని గుర్తించి తగినచర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. నెంబరుప్లేట్లులేని వాహాణాలపై అతివేగంగా వెళుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతూ తప్పించుకుని తిరుగుతున్న యువతఎపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేయాలని ఆయన సూచించారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి : ట్రాఫిక్ అదనపు డిసిపి

**బేగంపేట, జనవరి 17, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ట్రాఫిక్ 1 అదనపు డీసీపీ సి.వేణుగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవంలో భాగంగా శనివారం బేగంపేట టీటీఐ ఆధ్వర్యంలో రసూల్‌పురా జంక్షన్‌లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కారులో ప్రయాణించే సమయంలో సీటు బెల్టు, ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలన్నారు. రెడ్ సిగ్నల్ జంపింగ్, ఆటోపైలటింగ్, మైనర్ డ్రైవింగ్, అతివేగం, ట్రిపుల్ రైడింగ్‌లు చేయవద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ లక్ష్మణ్, ఇన్‌స్పెక్టర్ నాగుల అశోక్ ఏఎస్సై రమేష్‌బాబు, సిబ్బంది సాయికుమార్, కృష్ణ, టికే ఎలివేటర్ కంపెనీ సేఫ్టీ మేనేజర్ మహ్మద్ అబ్దుల్ తబరేజ్ పాల్గొన్నారు.


ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ అదనపు డిసిపి

# రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

**బేగంపేట జనవరి 17,ప్రభాతవార్త :** రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలంటూ శనివారం రాణిగంజ్ డిపోఎదుట రిటైర్డ్ ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా బకాయిలు విడుదల చేయాలని, ఇబ్బందులు తొలగించాలంటూ డిపో మేనేజర్‌కు వారు లిఖిత పూర్వక ఫిర్యాదు చేసారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ తాము రిటైర్డ్(2017లో)అయి తొమ్మిది సంవత్సరాలైందని, ఇంతవరకు సెటిల్మెంట్‌లు అన్ని రాకపోవడంతో తాము తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఆర్‌పీఎస్ 2017 అరియర్స్, 2017 ఏప్రిల్ నుంచి 2024 ఏప్రిల్ వరకు రావాల్సిన గ్రాట్యూటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ డిఫరెన్స్ డబ్బులు, 2024 అక్టోబర్ నుంచి 2025 డిసెంబరు వరకు రావాల్సిన లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ డబ్బులు, సీసీఎస్ సెటిల్‌మెంట్లు, ఆగస్టు 2025 నుంచి డిసెంబరు 2025 వరకు రావాల్సిన గ్రాట్యూటీలాంటి బకాయిలు తక్షణమే చెల్లించాలని ఇప్పటివరకు చెల్లించలేదన్నారు. డిడిలు చెల్లించిన కొందరికి హయ్యర్ పెన్షన్ 20నెలల గడచినా ఇంకా సాంక్షన్ చేయలేదన్నారు. 2013, 2017 వేతన వివరాలను ఈపీఎఫ్‌కు పంపకుండా పెన్షన్ పెరిగే అవకాశం లేకుండా చేయడం వల్ల పూర్తిగా నష్టపోతున్నామన్నారు. తాము అప్పులు తీర్చలేక, అధిక వడ్డీలు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులకుగురై కొందరు అకాల మరణం చెందుతున్నారని అన్నారు. 20లోపు చెల్లించాలని లేదంటూ 21న బకాయిల సాధన కోసం సారధ్య కమిటీ ఆధ్వర్యంలో బస్సు భవన్ వద్ద బైఠాయింపు శాంతి యుతంగా నిర్వహించనున్నట్లు వారు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో బి.డి.రావు, పీ.ఆర్.రెడ్డి, ఎండీ ఖలీల్, ఎం.నర్సింహా, కమర్, ఆర్ఎం రెడ్డి రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.


రాణిగంజ్ డిపో వద్ద ఆందోళణ నిర్వహిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు


ర్యాలీని ప్రారంభిస్తున్న బండ్లగూడ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్

## చాంద్రాయణగుట్టలో చీఫ్ మినిస్టర్ టోర్నమెంట్ ర్యాలీ

### - ప్రారంభించిన తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్

**చాంద్రాయణగుట్ట, జనవరి 17, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న చీఫ్ మినిస్టర్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని బండ్లగూడ మండల తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ కోరారు. మండల స్థాయి పోటీల ర్యాలీని శనివారం చాంద్రాయణగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద మషాల్‌ను అందజేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ నుండి ఫిబ్రవరి 28వ తేదీ వరకు జరిగే చీఫ్ మినిస్టర్ టోర్నమెంట్‌లో యువత, బాలబాలికలు పెద్దసంఖ్యలో భాగస్వాములు కావాలన్నారు. బండ్లగూడ మండల స్థాయిలో ఈనెల 28 నుండి 31వ తేదీ వరకు జరిగే టోర్నమెంట్‌లో పాల్గొనే ఔత్సాహిక క్రీడాకారులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఐఓఎస్ లక్ష్మణ్ సింగ్, పాఠశాల ఇంచార్జ్ నారాయణ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ కబడ్డీ కోచ్ జ్యోతీశ్వర్‌రెడ్డి, పిజికల్ డైరెక్టర్ వి.శ్రీనునాయక్, మజ్లిస్‌నేత కె.నాగరాజ్, కాంగ్రెస్‌నేత ఆర్.రాజు ముదిరాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి టిఆర్‌టిఎఫ్ కృషి


సుల్తాన్‌షాహిలో టిఆర్‌టిఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

**చాంద్రాయణగుట్ట, జనవరి 17, ప్రభాతవార్త :** ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) నిరంతరం కృషి చేస్తుందని హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ శ్రీవాణి శ్రీనాథ్, డాక్టర్ ఎస్.విజయభాస్కర్ తెలిపారు. శనివారం సుల్తాన్‌షాహి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చాంద్రాయణగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్థానిక ఉపాధ్యాయులతో కలిసి టీఆర్‌టీఎఫ్ క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు విశ్వసించే సంఘాలలో టీఆర్‌టీఎఫ్ ఒకటని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఐఓఎస్ లక్ష్మణ్ సింగ్, ఉపాధ్యాయులు నారాయణ, శ్రీనివాస్, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్, ఉపసర్పంచ్‌కు సన్మానం

**కూకట్‌పల్లి, జనవరి 17, ప్రభాతవార్త :** సంగారెడ్డి జిల్లాలోని గుడితాండ గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో ఘన విజయం సాధించి సర్పంచ్‌గా ఎన్నికైన లకావత్ కుమార్, ఉప సర్పంచ్‌గా ఎన్నికైన రూప్ సింగ్‌లు శనివారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావుని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు సర్పంచ్, ఉప సర్పంచ్‌లను శాలువాలతోసన్మానించి, ఇరువురినీ అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల ఆశీర్వాదంతో ఎన్నికైన సర్పంచ్, ఉప సర్పంచ్‌లు గ్రామ అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా చేసుకుని పారదర్శక పాలన అందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామస్థాయికి తీసుకెళ్లి ప్రతి పేదవాడికి న్యాయం జరిగేలా కృషి చేయాలని కోరారు. గుడితాండ గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా బిజెపి పార్టీ తరఫున పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు.

## రోహిత్ వేముల పేరిట చట్టాన్ని తీసుకురావాలి

### వడ్లమూరి డిమాండ్

**సైఫాబాద్, జనవరి 17 ప్రభాతవార్త:** రోహిత్ వేముల పేరిట చట్టాన్ని తెలంగాణ అసెంబ్లీలో వెంటనే చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్డమూరి కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. రోహిత్ వేముల 11 వర్ధంతి సందర్భంగా శనివారం హిమాయత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన సంస్మరణ సభలో ఆయన ప్రసంగించారు. సెంట్రల్ యూనివర్సిటిలో స్కాలర్ పరిశోధన విద్యార్థి రోహిత్ వేముల దళిత బహుజన విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం, విశ్వవిద్యాలయాల్లో కుల వివక్షత అణిచివేతలకు వ్యతిరేకంగా, డా.బి.ఆర్.అంబేద్కర్ ఆలోచనా విధానంతో పనిచేస్తున్నందుకు ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి, ఎబివిపి కాషాయి మాఫియా ఆదిపత్య వర్గం చేసిన వేదింపులు వల్ల మరణించారని ఆయన ఆరోపించారు. నేటికి రోహిత్ వేముల తల్లి రాదమ్మకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం రోహిత్ వేముల చేసిన పోరాటం దేశవ్యాప్తంగా సంచలనం అయిందన్నారు. రోహిత్ వేములను టార్గెట్ చేసిన కాషాయి క్రిమినల్ ముఠా చేసిన తీవ్రమైన వేదింపుల వల్ల రోహిత్ మరణించారని, ఇది వ్యవస్థీకృత రాజ్యం చేసిన హత్యని ఆరోపించారు. యూనివర్సిటిని సందర్శించిన ఎఐసిసి నేత రాహుల్‌గాంధీ చేసిన వాగ్దానం ప్రకారం విశ్వవిద్యాలయాల్లో, విద్యా సంస్థల్లో కుల వివక్షతకు వ్యతిరేకంగా కుల నిర్మూలన కోసం రోహిత్ వేముల పేరుతో ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాల్సిన బాధ్యత అయనపైన ఉందని, ఇందుకు సిఎం రేవంత్‌రెడ్డి చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐహెచ్‌ఆర్‌సి ఛైర్మన్ ప్రొఫెసర్ ప్రొఫెసర్ వి.ఎల్.రాజు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జె.ఎన్.రావు తదితరులు పాల్గొన్నారు. తొలుత వారు రోహిత్ వేముల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.


రోహిత్ వేముల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వడ్డమూరి కృష్ణస్వరూప్


డిప్యూటీ కమిషనర్ గంగాధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

## రమ్య గ్రౌండ్స్ చుట్టూ డబ్బాలను షెడ్లను తొలగించండి

**కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 17, ప్రభాతవార్త :** జిహెచ్‌ఎంసి ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా శనివారం కూకట్‌పల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి.గంగాధర్ బాలాజీనగర్ డివిజన్ పరిధిలోఉన్న 3వ ఫేసు రమ్య గ్రౌండ్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈసందర్భంగా కాలనీవాసులు ఆయనను సన్మానించి రమ్యగ్రౌండ్ చుట్టూ ఆక్రమించిన డబ్బాలను, షెడ్డులను తొలగించమని వినతి పత్రం అందజేశారు. కాలనీలోని 3వ ఫేసు రమ్యా గ్రౌండ్ ముందు, చుట్టూ కొంతమంది ఆక్రమించి షెడ్డులను వేసి డబ్బాలను పెట్టి వ్యాపారాలు చేసుకుంటూ ఇక్కడ నివసించే నివాసితులను, పాదచారులను, వాహన చోదకులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, కొంతమంది షెడ్డులు, డబ్బాలను వేసి అద్దెలకు ఇచ్చుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారనీ, సొమ్ము ఒకడిది సోకు ఒకడిది అన్నట్లుగా ఉందని ఉప కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. వాటిని తొలగించి ఇకమీదట ఎవ్వరు ఆక్రమించుకోకుండా తగిన చర్యలు తీసుకుని ప్రజలకు మెరుగైన సౌకర్యాలను కల్పించమని విజ్ఞప్తిచేశారు. ఇందుకుగాను డిసి గంగాధర్ సానుకూలంగా స్పందించి వెంటనే చర్యలు తీసుకుని ప్రజలకు పెరుగైన సౌకర్యాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కట్టా నరసింగరావు, కొల్లా శంకర్, షేక్ సత్తార్, షేక్‌మహబూబ్, రాచకొండ భాస్కర్, అరవిందరెడ్డి, సూర్యనారాయణ, జనగాం సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి కూటమి విజయం.. శ్రేణుల సంబరాలు..


సంబరాలు చేసుకుంటున్న బిజెపి శ్రేణులు

**కూకట్‌పల్లి, జనవరి 17, ప్రభాతవార్త :** మహారాష్ట్రలో జరిగిన కార్పొరేషన్ ఎలక్షన్స్‌లో బిజెపి కూటమి ఘన విజయం సాధించిన సందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్‌లో ఆ పార్టీ శ్రేణులు విజయోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్‌రావు, కేశవరావు, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు అల్లూరి రామరాజు, జిల్లా సెక్రెటరీలు మణిభూషణ్, స్రవంతి, నాయకులు కమలాకర్‌రెడ్డి, నరసింహచారి, రఘు, రాజు, అంజన్న రమేష్‌చాంద్, కార్యకర్తలుకలిసి మిఠాయి పంచుకుంటూ సంతోషం వ్యక్తం చేశారు.

## మోహన్ రావు పార్థీ దేహానికి నివాళులర్పించిన వడ్డేపల్లి

**కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 17, ప్రభాతవార్త :** కెపిహెచ్‌బి కాలనీకి చెందిన బిజెపి నాయకులు కళ్యాణ్ తండ్రి మోహన్ రావు ఇటీవల కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యతో బాధపడుతూ శనివారం పరమపదించారు. స్థానిక నాయకుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు కళ్యాణ్ నివాసానికి వెళ్లి మోహన్ రావు పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. రాజేశ్వరరావుతో కలిసి వేణుగోపాల్, భగవంత్ రెడ్డి తదితరులు నివాళులు అర్పించారు.

## లష్కర్ జిల్లా కోసం జరల్నిస్టుల సంఘీభావం

**కంటోన్మెంట్, జనవరి 17 ప్రభాతవార్త:** సికింద్రాబాద్(లష్కర్) ప్రత్యేక జిల్లా ఏర్పాటు కోసం లష్కర్ జిల్లా జర్నలిస్టులు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు హెచ్‌యూజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇ.చంద్రశేఖర్ తెలిపారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి అందించిన కార్పొరేటర్ విజయారెడ్డి

**జూబ్లీహిల్స్, జనవరి 17, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన పలు చెక్కులను శనివారం ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్ పి. విజయారెడ్డి తన కార్యాలయంలో లబ్ధిదారులకు అందించారు. నియోజకవర్గంలోని హిమాయత్‌నగర్ డివిజన్‌కు చెందిన అలీముద్దీన్ అహ్మద్‌కు అవసరమైన శస్త్రచికిత్స కోసం ముఖ్యమంత్రి సమానిధికి దరఖాస్తు చేసుకోగా రూ. 60వేలు మంజూరయ్యాయి. అలాగే ఖైరతాబాద్ డివిజన్‌కు చెందిన గురులింగం ఈశ్వర్‌రాజ్ గుండె సంబంధిత శస్త్రచికిత్స కోసం దరఖాస్తు చేసుకోగా రూ. 37,500లు మంజూరు చేశారు. ఆయా చెక్కులను ఆమె తన కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో దిలీప్‌రెడ్డి, సయ్యద్ జావిద్, కరాటే రమేష్, కిషోర్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF HON'BLE JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT : AT HAYATHNAGAR
O.S. No. 17 of 2026

Between:
Vinayak Phulgirkar ...Plaintiff
AND
The Tahasildar, Abdullapurmet Mandal and all concerned ...Defendants

To,
All Concerned
Please take notice that, the Plaintiff had filed the above SUIT for declaration to declare him as legal heirs of late **Laxmikant Rao Phulgirkar @ Laxmi Kanta Rao Phulgirkar S/o. Narayan Rao** who died on 25-05-2018 in respect of suit schedule property and the same has been posted on **27-02-2026**. If any person(s) having any objection or claims, they may appear on **27-02-2026 at 10:30 AM** before the Hon'ble Court, either in person or through advocate, otherwise the matter will be decided basing the documents available on record.

SCHEDULE PROPERTY
All that the open land vide plot No. 236, admeasuring 300 Sq.Yds in Survey No. 86, 87, 88 and 89, situated at Kuntloor Village, Hayathnagar Mandal (Presently Abdullapurmet Mandal), Ranga Reddy District, and bounded by:
North : Plot No. 237
South : Plot No. 235
East : 25' wide Road
West : Plot No. 233

\\ By order of the Court \\
M/s. P. PRAVEEN KUMAR
Advocates
Plot No. 31, Sushma Sai Nagar, Vanathalipuram, Hyderabad - 70
Cell : 9948092567

IN THE COURT OF HON'BLE III ADDL. JUNIOR CIVIL JUDGE:: MEDCHAL-MALKAJGIRI DIST; AT: KUSHAIGUDA
O.S.No. 15 of 2026

BETWEEN:
Smt. Dodda Sree Rekha and others .....Plaintiffs
AND
The Mandal Tahsildhar - Malkajgiri and another ..... Defendants

To
All Concerned
The General public hereby informed that Sri Dodda Sree Rekha and other have filed suit for Declaration of Legal Heirs to declare the Plaintiffs are the legal heirs of Late Sri Dodda Udaya Gopal who was died on 15th July, 2018. The case is posted for any claims are objections on 12-02-2026 from any concern. Hence if any person is/are having any claims/objections they may appear before the Hon'ble III Addl. Junior Civil Judge::M.M. Dist at Kushaiguda on **12-02-2026 at10:30am** failing which the matter will be decided on the material available.

(By order of the Court)
Sd/-
YATA BHASKAR
SURENDER RAO PENCHALA
Advocates
H.No.LIG - 97, TSIIC Colony, Post: ECIL, Hyderabad -500062
Cell No. 9849613691, 7997444488

PUBLIC NOTICE

The General Public is hereby informed that my client **Nacharam Naveen Kumar** S/o.Nacharam Anjaneyulu R/o Godumakunta Village, Keesara Mandal, Medchal Malkajgiri district has entered into an agreement of sale to purchase all that the Agriculture land in Sy.No.303/1 admeasuring Ac.0-36 gts and in Sy.No.303/2 admeasuring Ac.0-36 gts, total admeasuring Ac.1-32 gts situated at Keesara Village and Mandal, Under Dammaiguda Municipality, Medchal Malkajgiri District from Smt. Donthi Sunitha Reddy and my client has paid substantial sale consideration.
I hereby called upon to take note that, if any objections/ claims in respect of the above property, may send the undersigned their objections, if any, enclosing hereto certified copies of all documents basing on which any alleged objections is sought to be raised within one week from the date of this notice. In the event of not receiving any objections within one week from the date of this notice, my client will proceed to this transaction. Thereafter my client will not be responsible for any objections.

Sd/-
S.S.PRAKASH REDDY,
Advocate
Office: 2nd Floor, Andal Complex, Opp: Venkateshwara Swamy Temple, Kushaiguda, Ecil,Hyd-62
Ph: 9440067268


జిహెచ్‌ఎంసి కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గిరిజనులు

## జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో గిరిజనులకు 30 డివిజన్లు కేటాయించాలి

**సైఫాబాద్, జనవరి 17 ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో గిరిజను(ఎస్టీ) లకు 10 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆనేక మంది గిరిజనులు శనివారం జిహెచ్‌ఎంసి కమిషనర కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏకలవ్వ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ దర్నా జరిగింది. ఈ సందర్భంగా జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధర్మానాయక్, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరాం నాయక్, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధానకార్యదర్శి అంజయ్య నాయక్ తదితరులు మాట్లాడుతూ జిహెచ్‌ఎంసిలో 300 డివిజన్లు ఉన్నప్పుడు గిరిజనుల 10 శాతం రిజర్వేషన్ల ప్రకారం 30 డివిజను వస్తాయని, అలా కేటాయించకుండా కేవలం 5 డివిజన్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకుంటే సహించేదిలేదని హెచ్చరించారు. తక్షణమే 10 శాతం రిజర్వేషన్‌ల ప్రకారం 30 డివిజన్లును కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. కనీసం 6 శాతం రిజర్వేషన్‌లను అమలు చేయకపోవడం గిరిజ లను తీవ్రం అన్యాయానికి, అణిచివేతకు గురిచేయడమేనని ఆరోపిం చారు. తెలంగాణ రాష్ట్రం రావడానికి, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి గిరిజనులు ఎంతో కృషి చేశారని, కాని 5 డివిజన్లు కేటాయించి మోసం చేయడం దారుణమన్నారు. ధర్నాలో జెఎసి నాయ కులు కుతాడి ముఖేష్, చిట్టిబాబు, బదనాపురం రఘు, కందల వెంకటేష్, వనం గంగయ్య, పిట్టల లింగయ్య, సమ్మయ్య, రాజేష్, కార్తిక్, శ్రీకాంత్, విజయ్, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు జిహెచ్‌ఎంసి కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు.

## టెలిఫోన్ గుర్తుపై టిఆర్‌ఎస్(డి) ఎన్నికల్లో పోటీ

**సైఫాబాద్, జనవరి 17 ప్రభాతవార్త:** వచ్చే మునిసపల్, కార్పొరేషన్, జెడ్‌పిటిసి, ఎంపిటిసి, గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో తమ పార్టీ 'టెలిఫోన్' గుర్తుపైన ఎన్నికల బరిలోకి దిగుతుందని టిఆర్ఎస్ (డి) రాష్ట్ర అధ్యక్షుడు నరాల సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు ఎన్నికల కమిషనర్ తమకు టెలిఫోన్ గుర్తును కేటాయించడంజరిగిందని ఆయన మీడియాకు చెప్పారు. తమ పార్టీ యువ నాయత్వాన్ని, మహిళా నాయకత్వాన్ని, అనుభవజ్ఞులను ప్రోత్సహిసుందని, తెలంగాణ సబ్బండ కులాల ప్రజలు టెలిఫోన్ గుర్తును గుర్తుంచుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అన్ని ఎన్నికల్లో, అన్ని స్థానాల్లో పోటీ చేసి తమ సత్తా చాటుతామని సత్యనారాయణ ధీమా వ్యక్తం చేశారు.

## 20న టిడబ్ల్యుజెఫ్ హైదరాబాద్ జిల్లా స్థాయి సమావేశం

**సైఫాబాద్, జనవరి 17 ప్రభాతవార్త:** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టిడబ్ల్యుజెఫ్) హైదరాబాద్ జిల్లా స్థాయి సమావేశం ఈ నెల 20వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు రాంనగర్‌లోని రాజ్ ఫంక్షన్ హాల్‌లో జరుగుతుందని ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య తెలిపారు. సమావేశంలో హైదరాబాద్‌లో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యక్రమాన్ని రూపొందించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 32 జిల్లాల్లో మాదిరిగానే హైదరాబాద్ జిల్లాలో ఫెడరేషన్ కమిటీ ఏర్పాటుకు సన్నహాలు జరుగుతున్నాయని, ఇందులో భాగంగా హైదరాబాద్‌లో పనిచేస్తున్న ఆనేక మంది ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులతో సమాలోచన చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర నాయకులతోపాటు పలువురు హైదరాబాద్‌లోని సీనియర్ జర్నలిస్టులు పాల్గొంటారని, అలాగే జిల్లా అడ్‌హక్ కమిటీ వేయడం జరుగుతుందన్నారు.

## 21న దేవి దేవాలయం 161వ వార్షిక బ్రహ్మోత్సవాలు

**చాంద్రాయణగుట్ట, జనవరి 17, ప్రభాతవార్త :** చాంద్రాయణగుట్టలోని శ్రీదేవి దేవాలయం 161వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 21వ తేదీ బుధవారం ప్రారంభమై మూడురోజులపాటు జరుగనున్నాయి. ప్రధాన అర్చకులు ప్రమోద్‌కుమార్ కార్వాంకర్ ఆధ్వర్యంలో బుధవారం తొలి రోజున ఉదయం అమ్మవారికి అభిషేకం, మండప, గణపతి, నవగ్రహ పూజ, హోమం, చండి యజ్ఞం, మధ్యాహ్నం 12 గంటలకు మాతృమూర్తులచే సామూహిక కుంకుమార్చన, ఒంటి గంటకు మహా హారతి, అన్న ప్రసాద వితరణ, 22వ తేదీ గురువారం అమ్మవారికి అభిషేకం, చండీ యజ్ఞం, కుంకుమార్చన, హారతి, అన్నప్రసాదం, సాయంత్రం హారతి, ప్రసాద పంపిణీ, 23వ తేదీ శుక్రవారం అమ్మవారికి అభిషేకం, చండీయజ్ఞం, పూర్ణాహుతి, మంత్ర పుష్పాంజలి, సాయంత్రం ఆరు గంటలకు అమ్మవారి భవ్య ఊరేగింపు నిర్వహించనున్నారు. అమ్మవారి బ్రహ్మోత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మాతేశ్వరి అనుగ్రహానికి పాత్రులు కావాలని ప్రధాన అర్చకులు ప్రమోద్ కుమార్ కార్వాంకర్ కోరారు.

## ఉద్రిక్తతకు దారి తీసిన బిఆర్‌ఎస్ శాంతి ర్యాలీ

**అడ్డగుట్ట, జనవరి 17 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ చారిత్రక వారసత్వాన్ని కాపాడాలని, ఈ ప్రాంతాన్నీ ప్రత్యేక మున్సిపల్ కార్పొరేషన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ శనివారం బిఆర్ఎస్ తలపెట్టిన శాంతి ర్యాలీ ఉద్రిక్తతకు దారి తీసింది. పోలీసులు ఈర్యాలీకి అనుమతి నిరాకరించడంతో పార్టీ శ్రేణులను ఎక్కటి కక్కడే అడ్డుకొని అరెస్టులు చేయడంతో సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉద్రికత్తత వాతావరణం నెలకొంది. సికింద్రాబాద్ అస్థిత్వం, ఆత్మగౌరవం, నినాదంతో బిఆర్ఎస్ శనివారం నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఉదయం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభమై క్లాక్‌టవర్, ప్యాట్నీ, ప్యారడైజ్ సర్కిల్ మీదుగా ఎంజి రోడ్డు వరకు ర్యాలీ జరుగాల్సి ఉంది. అయితే శాంతి భద్రతల దృష్ట్యా పోలీసులు ర్యాలీకి అనుమతించలేదు. తెల్లవారు జాము నుంచే బారీగా పోలీసు బలగాలు మోహరించాయి. ర్యాలీలో పాల్గొనేందుకు నల్లబ్యాడ్జీలతో తరలివచ్చిన బిఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న అల్ఫా హోటల్‌లోకి వెళ్లిన పార్టీ శ్రేణులను పోలీసులు అడ్డుకొని వ్యాన్‌లోకి తరలించారు. దీంతో పోలీసులకు, బిఆర్ఎస్ కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది.

## శ్రీ విజయదుర్గా మాత దేవాలయంలో రేపటి నుండి రాజశ్యామల అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు


శ్రీ విజయదుర్గా మాత దేవాలయం

**సైదాబాద్, జనవరి 17 ప్రభాతవార్త:** సైదాబాద్ మాతా మైదానం లోని శ్రీ విజయదుర్గా మాత దేవాలయంలో రాజశ్యామల అమ్మ వారి నవరాత్రి మహోత్సవాలను ఈ నెల 19వ తేది నుండి 28వ తేది వరకు అత్యంత వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉత్సవాలకు ఆలయాన్ని సుంద రంగా తీర్చిదిద్దుతున్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవ కాశం ఉండడంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటి ప్రతిని ధులు అన్ని ఏర్పాట్లు చేస్తూ తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

### మీడియాను గుప్పిట్లో పెట్టుకోవాలనుకుంటున్న రేవంత్‌రెడ్డి

**జర్నలిస్ట్‌ల అరెస్ట్‌ను ఖండిస్తున్నాం : ప్రధానకార్యదర్శి అరవింద్‌శర్మ**

**ఎల్.బి.నగర్, జనవరి 17 ప్రభాతవార్త:** ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రజలు ప్రభు త్వాన్ని ప్రశ్నిస్తుంటే తట్టుకోలేక ప్రభుత్వం మీడియాను టార్గెట్ చేస్తూ వారిని అరెస్టులు చేయడం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కిందని మహేశ్వరం నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ ఆరోపించారు. శుక్రవారం అయినా ఆర్కేపురంలో మాట్లాడుతూ ఇచ్చిన 420 హామీలు నెరవేర్చలేక ప్రతిపక్షాలపై బూతు పురాణాలు, మీడియాపై ఆంక్షలు విధించి మీడియా రంగాన్ని తన గుప్పిట్లో పెట్టుకోవాలని చూస్తున్నాడని, జర్నలిస్టులను వేధించడం అన్యాయం అన్నారు. ప్రసారం చేసిన వీడియోలకు ఎలాంటి ఆధారాలు లేకుంటే, ముందస్తు నోటీసు ఇచ్చి వారిని విచారణకు పిలిస్తే బాగుండని అన్నారు. ఎలాంటి నోటీసు లేకుండానే అర్ధరాత్రి వారిని అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్యని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగుతున్న కొండా సురేఖ కేటీఆర్ పై నిరాధారణ ఆరోపణలు చేసినప్పుడు ఈ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. మీడియా ప్రతినిధులను పోలీసులు వేధించడం ద్వారా ఎందుకు కాదన్నారు.

## రోడ్డు భద్రతపై అవగాహన ముఖ్యం



ముగ్గులను పరిశీలిస్తున్న ఏసీపీ కృష్ణయ్య, సీఐ సైదులు

**ఎల్.బి.నగర్, జనవరి 17 ప్రభాతవార్త:** రోడ్డు భద్రతపై మహి ళలు అవగాహన పెంపొందించుకోవాలని ఎల్బీనగర్ ఎసిపి కృష్ణ య్య చైతన్యపురి ఇన్స్పెక్టర్ సైదులు పేర్కొన్నారు. కొత్తపేట న్యూ మారుతినగర్ కమ్యూనిటీ హాల్ ముందు మహిళలకు రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ పై అవగాహన కల్పిస్తూ శనివారం పోలీసులు సదస్సు లు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎసిపి కృష్ణయ్య, చైతన్యపురి ఇన్స్పెక్టర్ సైదులు, సెక్టార్ ఎస్సై భద్రయ్య ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొని అవగాహన కల్పించారు. మహిళలతో ముగ్గుల ద్వారా రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలకు సంబంధించి అవగా హన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు జీబ్రా, సిగ్నల్సు తదితర నిబంధనలకు సంబంధించి వాటిని పా టించాల్సిన విషయాన్ని గురించి మహిళలకు అవగాహన కల్పిం చారు. ముఖ్యంగా తమ పిల్లలు వాహనాలు నడిపేటప్పుడు నిర్ల క్ష్యాన్ని వీడే విధంగా తల్లిదండ్రులు జాగ్రత్తలు చెప్పాలని సూచిం చారు. న్యూమారుతినగర్ కాలనీ కార్యవర్గ సభ్యులు విజయ గౌ డ్, తాళ్లపల్లి సుజాత, ముద్దం సంతోషి, నిరంకి హేమలత, నిరంకి రామేశ్వరి, మాధవి, ప్రతిభ, పారిశుద్ధ కార్మికులు, న్యూ మారుతినగర్ కాలనీ అధ్యక్షులు నీరనీకి రవి, సెక్రటరీ రాళ్ళపల్లి ప్రభాకర్, ట్రెజరర్ శ్రీనివాస్, అషిస్ రావు, బి.అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బీరప్పగడ్డలో సిసి రోడ్డు పనులు : బన్నాల గీత


బీరప్పగడ్డలో సిసి రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, జనవరి 17 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ బీరప్ప గడ్డలో రూ.95 లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు పనులను శనివారం స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పలు ప్రాంతాల్లో సిసి రోడ్డు పనులు చేపట్టామని తెలి పారు. రోడ్డు నిర్మాణ సమయంలో ఇంజనీరింగ్ విభాగం అధికా రులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా చూడాలని కోరారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో మున్సిపల్ డిఇ వెన్నెలగౌడ్, ఎఇ రాజ్ కుమార్ వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్, బిఆర్ఎస్ పార్టీ నేతలు బన్నాల ప్రవీణ్ ముది రాజ్, ఏదుల కొండల్ రెడ్డి, ముద్దం శ్రీనివాస్ యాదవ్, శ్యామ్, బాలు, బీరప్పగడ్డ కాలనీ అధ్యక్ష కార్యదర్శులు కొక్కంద జగన్, పిట్ల రామచందర్, సలహాదారుడు జగన్, సాల్మన్, ఎం.శ్రీను, బాలరాజు, గణేష్, జహంగీర్, పండు, చంద్రయ్య పాల్గొన్నారు.

## టిఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ డైరీ ఆవిష్కరణ


టిఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్, ఉపాధ్యక్షుడు చిలక నరసింహారెడ్డి తదితరులు

**మలక్ పేట, జనవరి 17, ప్రభాతవార్త:**
టి ఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ డైరీ, క్యాలెండర్ ను రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ రామకృష్ణ రావు, అసోసియేషన్ అధ్యక్షు డు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ తదితరులు ఆవిష్కరించారు. ప్రధాన కార్యదర్శి ముజీబ్ అధ్యక్షతన జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షులు కస్తూ రి వెంకటేష్ , కోశాధికారి సత్యనారాయణ గౌడ్, ఉపాధ్యక్షులు చిలక నరసింహ రెడ్డి, పరమేశ్వర్ ,సంతోష్ కుమార్ ఇతర 33 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు మరియు సెంట్రల్ యూనియన్ కార్యవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బడంగ్‌పేట్ సర్కిల్‌లో డిసి త్రిల్లేశ్వర్‌రావు ఆధ్వర్యంలో స్వచ్ఛ ప్రతిజ్ఞ

**సరూర్‌నగర్, జనవరి 17 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి బడం గ్‌పేట్ సర్కిల్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పెషల్ సానిటేషన్ డ్రైవ్ నేపథ్యంలో డిప్యూటీ కమీషనర్ త్రిల్లేశ్వర్ రావు ప్రజలతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. గత కొన్ని రోజు లుగా సర్కిల్ పరిధిలోని ఆరు డివిజన్లలో డిసి ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంగతి విదితమే. అయితే రోజూ వారీగా డివిజన్లలో పర్యటిస్తూ స్పెషల్ సానిటేషన్ డ్రైవ్‌ను స్వయంగా పరిశీలిస్తున్న డిసి సానిటేషన్ సిబ్బందికి సూచనలు, సలహాలు ఇస్తూ మార్గద ర్శనం చేస్తున్నారు. అయితే భోగి, సంక్రాంతి, కనుమ పండుగల సందర్భంగా సర్కిల్ పరిధిలోని నాదర్‌గుల్, ప్రశాంతిహిల్స్, జిల్లెలగూడ, మీర్‌పేట్, బడంగ్‌పేట్, బాలాపూర్ డివిజన్‌లలో పారిశుధ్య కార్మికులచే శుభ్రం చేయించిన త్రిల్లేశ్వర్‌రావు మహిళా కార్మికులచే ప్రత్యేకంగా ముగ్గులు వేయించారు. అదే విధంగా పలు ప్రాంతాల్లో మొ క్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం 57 డివిజన్‌కు సంబంధించి నాదర్‌గుల్ ప్రభుత్వ పాఠశాల, టీచ ర్స్ కాలనీ, 58 డివిజన్‌లోని మీర్‌పేట్ అయోధ్యనగర్ జివి పి పాయింట్, 59 డివిజన్‌లోని జిల్లెలగూడ గాయత్రీనగర్, 60వ డివిజన్‌లోని మీర్‌పేట్ భారత్ పెట్రోల్ బంక్, జివిపి పాయింట్, 61 డివిజన్‌లోని బడంగ్‌పేట్ డ్వాక్రా భవన్, 62 డివిజన్‌లోని బాలాపూర్ ప్రభుత్వ పాఠశాల వద్ద పారి


సానిటేషన్ సిబ్బంది శుభ్రం చేసి ముగ్గులు వేసిన ప్రాంతాల్లో మొక్కలు నాటుతున్న బడంగ్‌పేట్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ త్రిల్లేశ్వర్‌రావు

శుధ్య మహిళా కార్మికులు, సిబ్బంది పరిశుభ్రం చేసి వేసిన ముగ్గులను పరిశీలించిన డిసి ఆయా ప్రాంతాల్లో స్థానికులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ సిటిజన్లు, మహిళలు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన స్వచ్ఛ బడంగ్‌పేట్ సర్కిల్/డివిజన్లపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా త్రిల్లేశ్వర్‌రావు మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో పారిశుధ్యానికి ప్రజలు సహకరించాలనీ, చెత్తను రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ పారేయరాదని కోరారు. ఇళ్ళల్లో తడి, పొడి చెత్తను వేరు చేసి ఇళ్ళ వద్దకే వచ్చే స్వచ్ఛ ఆటో రిక్షాల సిబ్బందికి అందజేయాలని సూచించా రు. కార్యక్రమంలో పలువురు అధికారులు, స్థానిక నాయకు లు, మాజీ ప్రజాప్రతినిధులు, వార్డు ఆఫీసర్లు, సానిటేషన్ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# రామంతాపూర్‌లో ఘనంగా ఎంపిఆర్ క్రికెట్ క్రీడా పోటీలు

**రామంతాపూర్,, జనవరి 17 ప్రభాతవార్త :** రామంతాపూర్ చిన్న చెరువు మైదానంలో శనివారం కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎండి.రఫీక్ ఆధ్వర్యంలో ఎంపిఆర్ క్రికెట్ పోటీ లు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన క్రీడా పోటీలను కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వ ర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎం.పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ యువతలో మానసిక ఉల్లాసాన్ని పెంచేందుకు ఈ క్రీడా పోటీలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. క్రీడాకారులకు తగు సహకారం అందిస్తామని తెలిపారు. క్రీడాకారులను ప్రో త్సహించిన ఎం.డి.రఫీక్‌ను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు. గత ప్రభుత్వ హయాంలో పాలకులు క్రీడలను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ క్రీడాకారులకు చేయూత అందిస్తుంద న్నారు. క్రీడా పాలసీ తీసుకుని వచ్చి క్రీడాకారులను ప్రోత్స హిస్తున్నామని తెలిపారు. క్రీడాకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కొద్దిసేపు క్రికెట్ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి


రామంతాపూర్‌లో చిన్న చెరువు వద్ద క్రికెట్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

ప్రతినిధి ఎం.డి.తౌఫిక్, మహమ్మద్ రఫీక్ ఆకారపు అరుణ్ పటేల్, కంది శ్రవణ్ రెడ్డి, వల్లపు శ్రీకాంత్ యాదవ్, గరిక సుధాకర్, నామ్ రాజిరెడ్డి, అంగాల సందీప్, పూస సత్త య్య, గంగపుత్ర భాస్కర్, మొగిలి లింగం, బుల్లెట్ అశోక్, సందీప్, భాస్కర్, మీట్టు, జిల్లు, సత్తిరెడ్డి, వజీర్ బాబా, సాయి, శాగా శ్రీధర్, అంబికా, మహేష్ సూర్య, ఐకాన్ మధు, స్వామి, మహ్మద్ జహంగీర్, చిన్న కాషామల్లా శంకర్, కిషోర్, గాదె రఘు, పాషా, నర్సింగరావు. నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

## సంత్ సేవాలాల్ మహారాజ్ దేవాలయాన్ని రంగారెడ్డి జిల్లా పరిసరాల్లో నిర్మించాలని డిమాండ్

**తుర్కయంజాల్ జనవరి17 ప్రభాతవార్త**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బంజారా లంబాడీల ఆరాధ్య దైవమైన సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ దేవాలయాన్ని రంగారెడ్డి జిల్లా పరిసర ప్రాంతాలలో 100 ఎకరాలు కేటా యించి, రూ.500 కోట్ల వ్యయంతో నిర్మించాలని తెలంగాణ గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్ నాయక్ రాష్ట్ర ప్రభుత్వా న్ని కోరారు. గత నెల నల్గొండ జిల్లా దేవరకొండ పబ్లిక్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అచ్చంపేట నియోజ కవర్గంలోని మద్దిమడుగు వద్ద దేవాలయాన్ని నిర్మిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే రాష్ట్రంలోని సుమారు 50 లక్షల బంజారా లంబాడీలకు అనువుగా, రవా ణా సౌకర్యాలు మెరుగ్గా ఉండే రంగారెడ్డి జిల్లా పరిసర ప్రాంతాలలో దేవాలయాన్ని నిర్మిస్తే మరింత ప్రయో జనక రంగా ఉంటుందని వారు అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని లంబాడి ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



దృష్టికి తీసుకెళ్లి, సానుకూల నిర్ణయం తీసుకొని సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్‌తో పాటు జగదంబా మాత దేవాలయాన్ని కూడా నిర్మించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బు నాయక్, జనరల్ సెక్రటరీలు విజయ్ నాయక్, నరేష్ నాయక్, రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ రమేష్ రాథోడ్, కోఆర్డినేటర్ చందులాల్ రాథో డ్, కాట్రావత్ దశరథం రాథోడ్ పాల్గొన్నారు.

## శస్త్ర చికిత్స నిర్వహించి రోగి కాలును కాపాడిన మలక్ పేట్ కేర్ ఆస్పత్రి వైద్యులు

**మలక్ పేట, జనవరి 17, ప్రభాతవార్త:**
మలక్ పేట కేర్ ఆస్పత్రి వైద్యులు ఓ రోగికి విజయవం తంగా శస్త్ర చికిత్స ను నిర్వహించి కాలును కాపాడారు. కింది కాలును తొలగించాల్సిందేనని పలువురు వైద్యులు సూచించిన ఓ రోగికి మలక్ పేట కేర్ ఆస్పత్రిలో ఆసుపత్రి వైద్యులు అత్యుత్తమ చికిత్సలు అందించి అతని కాలును రక్షించి రోగికి నడిచే ఆనందాన్ని మలక్‌పేట్ కేర్ ఆస్పత్రి వైద్యులు కల్పించారు. మలక్ పేట కేర్ ఆస్పత్రి సీనియర్ కార్డియోతోరాసిక్, వాస్కులర్ సర్జన్ డాక్టర్ సుధీర్ గంద్రకోట, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ ఎడ్ల లు మాట్లాడుతూ ...తిరుపతికి చెందిన 67 ఏళ్ల వృద్ధుడికి రెండు నెలల క్రితం కుడి కాలులో తీవ్రమైన నొప్పి, పెద్దవే లు నల్లబడటం వంటి సమస్యలతో బాధపడుతుండడంతో కాలులో రక్తప్రసరణ ఆగిపోయిందని గుర్తించి తిరుపతిలో శస్త్రచికిత్స చేశారు. శస్త్రచికిత్స తర్వాత కూడా మందులు వాడుతున్నా, పరిస్థితి మెరుగుపడలేదని, క్రమంగా పెద్దవే లు పాడైపోయే (గ్యాంగ్రీన్) పరిస్థితి ఏర్పడిందని, తరువాత చేసిన స్కాన్‌లలో, కాలుకు వెళ్లే రక్తనాళంలో మళ్లీ గడ్డలు ఏర్పడి రక్తం వెళ్లడం పూర్తిగా ఆగిపోయిందని తేలిందని, దీంతో పలు ఆసుపత్రుల్లో రోగి సంప్రదించగా కాలును తొలగించాల్సిందేనని చెప్పారు. అయితే, చివరిసారిగా ఆశతో రోగి మలక్ పేట కేర్ ఆస్పత్రిలో సంప్రదించడం జరి గిందని తెలిపారు. కేర్ ఆస్పత్రి వైద్యులు పూర్తిగా పరీక్షించి, మళ్లీ శస్త్రచికిత్స చేసి రక్తప్రసరణ తిరిగి ప్రారంభించవచ్చని నిర్ణయించి విజయవంతంగా శస్త్ర చికిత్సను నిర్వహించా


రోగికి శస్త్ర చికిత్సను నిర్వహిస్తున్న ఆసుపత్రి వైద్యులు

రు. శస్త్రచికిత్స సమయంలో ప్రత్యేక యంత్రాల సహాయంతో కాలుకు మళ్లీ రక్తం బాగా వెళ్లుతున్నట్టు నిర్ధారించారు. రోగి ఎలాంటి ఇబ్బందులు లేకుండా కోలుకుని, ఆరవ రోజున ఆరోగ్యంగా డిశ్చార్జ్ అయ్యాడనిఒక నెల తరువాత జరిగిన ఫాలోఅప్‌లో, పెద్దవేలు వద్ద ఉన్న గాయం పూర్తిగా మాని పోయిందనీ, ప్రస్తుతం రోగి నొప్పిలేకుండా నడవగలుగు తున్నాడని ఈ విధంగా కాలు తొలగింపును నివారించ గలిగామని తెలిపారు. వైద్యుల సూచన ప్రకారం, వృద్ధులు, షుగర్ ఉన్నవారు, కాలులో నొప్పి, రంగు మారడం, గాయాలు మానకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని, సకాలంలో చికిత్స తీసుకుంటే, కాలు తొలగించే ప్రమాదాన్ని నివారించవచ్చని వివరించారు. రోగి ఆనందంతో మాట్లాడుతూ "అన్ని చోట్ల కాలు తీసేయాలన్నారని ఇక నడవలేనేమోనని భయపడ్డాను, కానీ ఇప్పుడు నడవగలు గుతున్నానని, నా కాలు కాపాడిన కేర్ హాస్పిటల్స్ వైద్యుల కు జీవితాంతం కృతజ్ఞుడిని అని పేర్కొన్నారు.

# సైబర్ మోసాలపై మల్కాజ్‌గిరి పోలీసుల ఉక్కుపాదం

## వారం రోజుల్లో 2 కేసుల ఛేదనం.. 3 మంది అరెస్ట్.. రూ.16.28 లక్షల రీఫండ్

**నేరేడ్ మెట్, మల్కాజ్‌గిరి కమిషనరేట్ జనవరి 17,**
మల్కాజ్‌గిరి కమిషనరేట్ సైబర్ క్రైమ్ పోలీసులు జనవరి 11 నుంచి 17 వరకు వారం రోజుల్లో రెండు సైబర్ మో సాల కేసులను ఛేదించి, మూడు మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు డీసీపీ ఎస్‌వీ నాగలక్ష్మి వెల్లడించారు. దర్యాప్తులో సైబర్ నేరగాళ్ల నెట్‌వర్క్ దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. న్యాయస్థానం ద్వారా బాధితులకు మొత్తం రూ.16,28,616/ నగదు రీఫండ్ కూడా చేయిం చినట్లు పేర్కొన్నారు. పెట్టుబడి మోసం కేసులో ఖాతా దారుడి అరెస్ట్ మొదటి కేసులో పెట్టుబడి మోసానికి సహక రించిన ఖాతాదారుడిని కరీంనగర్ ప్రాంతంలో అరెస్ట్ చేసి న్యాయస్థానానికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఫేస్‌బుక్‌లో వచ్చిన లోన్ ప్రకటన ద్వారా "జెన్నిత్ క్యాపిటల్ ఫైనాన్స్ పేరుతో పరిచయం ఏర్పరచుకున్న నిందితుడు, తాను ఆదిత్య" అని చెప్పుకుంటూ మోసానికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. మహబూబ్ పాషా అనే వ్యక్తి యాక్సిస్ బ్యాంక్‌లో కరెంట్ అకౌంట్ తెరిచి, ఖాతా వివరాలను మోసగాళ్లకు అందజేశాడు. 16 నవంబర్ 2025న బాధితుడు ఆ ఖాతాలో రూ.16 లక్షలు జమ చేసినట్లు పోలీ సులు గుర్తించారు. ఖాతాను మోసాలకు ఉపయోగిస్తున్న విషయం తెలిసినా నిందితుడు కమీషన్ తీసుకుని సహకరిం చినట్లు దర్యాప్తులో వెల్లడైంది. మహబూబ్ పాషా గతంలో హర్యానాలోని యమునానగర్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన రెండు కేసుల్లోనూ నిందితుడిగా ఉన్న ట్లు పోలీసులు తెలిపారు. పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో రూ.47 లక్షల మోసంరెండో కేసులో టెలిగ్రామ్ గ్రూప్ ద్వారా పార్ట్ టైమ్ ఉద్యోగం పేరుతో భారీగా డబ్బులు వసూలు చేసిన ముఠాకు సహకరించిన ఇద్దరిని నల్గొండలో అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. "వీఆర్‌బీఓ గ్రూప్" పేరుతో హోటల్ బుకింగ్ పనులు చేస్తే కమీషన్ ఇస్తామని నమ్మబలికి మొద ట కొద్ది మొత్తాలు చెల్లించి, తర్వాత పెద్ద మొత్తాలు జమ చేయించారని పోలీసులు వివరించారు. 27 జూన్ నుంచి 14 జూలై 2025 మధ్య బాధితుడు మొత్తం 32 లావా దేవీల్లో రూ.47,65,159/ జమ చేయగా, తిరిగి కేవలం రూ.62,550/ మాత్రమే అందిందని తెలిపారు. టిడిఎస్ పేరుతో మరిన్ని డబ్బులు అడగడంతో బాధితుడికి మొత్తం నష్టం రూ.47,02,609/కు చేరిందని పోలీసులు పేర్కొన్నా రు. ఈ కేసులో ప్రధాన నిందితుడు బీరెల్లి వినయ్ కుమా ర్, అతడికి సహకరించిన ఖాతాదారుడు కాతుల ప్రశాంత్‌ల ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరి బ్యాంకు ఖాతాలు ఆంధ్రప్రదేశ్‌లోని వెల్దుర్తి పోలీస్ స్టేషన్, మహారాష్ట్రలోని సీబీడీ బెలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మరో రెండు కేసుల్లోనూ ఉపయోగించబడినట్లు గుర్తించారు .ప్రజలకు పోలీసుల సూచన....సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీసీపీ ఎస్‌వీ నాగలక్ష్మి సూచిం చారు. అన్యుల ఫోన్ కాల్స్‌ను నమ్మవద్దని, సోషల్ మీడి యాలో వచ్చే పెట్టుబడి, లోన్, పార్ట్‌టైమ్ ఉద్యోగ ప్రకట నల పట్ల జాగ్రత్త వహించాలని తెలిపారు. బ్యాంకు ఖాతా లను అద్దెకు ఇవ్వడం లేదా అమ్మడం చట్టవిరుద్ధమని, అలా చేస్తే తీవ్ర శిక్షలు తప్పవని హెచ్చరించారు. మోసానికి గు రైతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

## క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయం


క్రీడా సామాగ్రి అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జనవరి 17 ప్రభాతవార్త:** క్రీడాకారులను ప్రోత్సహిస్తూ వారికి అవసరమైన క్రీడా సామాగ్రిని అందజేయడం అభినందనీయమని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. ద్రోణాచార్య పారా స్పోర్ట్స్ అకాడమీ ఫౌండర్, కోచ్ వేణు వినుకొటి దగ్గర శిక్షణ పొందుతున్న జాతీయ, అంతర్జాతీయ పారా క్రీడాకారులకి శిక్షణ కొరకు అవసరమైన క్రీడాపరికరాలను బి.కనకారావు (భారతీయ వైమానిక దళం) విశ్రాంత ఉద్యోగి ఆర్థిక సహా యంతో శనివారం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద వారికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా పరికరాలు అందించడం పట్ల అభినందనలు తెలియ జేస్తూ రాబోయే రోజుల్లో క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించాలన్నారు. క్రీడాకారులకు కావాల్సిన సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ముద్దగోని సతీష్‌గౌడ్ ఆందోజు సత్యంచారి, తూర్పాటి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## ఎండోమెంట్ కాలనీలో వరద నీటి కాలువ పనులు : బండారు శ్రీవాణి


రామంతాపూర్ ఎండోమెంట్ కాలనీలో వరద నీటి కాలువ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరులు

**రామంతాపూర్, జనవరి 17 ప్రభాతవార్త :** రామంతపూర్ డివిజన్ ఎండోమెంట్ కాలనీలో చేపట్టిన వరద నీటి కాలువ పనులను శనివారం స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భం గా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఎండోమెం ట్ కాలనీలో ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న స్టామ్ వాటర్ డ్రైనేజీ పనులు ప్రత్యేక చొరవ తీసుకుని పూర్తి చేసినట్లు తెలిపారు. ఎండోమెంట్ కాలనీ, న్యూ గోఖలే నగర్ పరిసర ప్రాంతాల్లో వరద నీటి కాలువ పనులు సక్రమంగా లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు వచ్చినట్లు తెలిపారు. సుమారు రూ.7లక్షల వ్యయంతో కాలువ పున రుద్ధరణ పనులు చేపట్టినట్లు ఆమె స్పష్టం చేశారు. పను లు త్వరగా పూర్తి చేయాలని, దీంతో స్థానికుల సమస్య పూర్తిగా నెరవేరుతుందన్నారు. వర్షకాలంలో ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపా రు. ఈ కార్యక్రమంలో ఎఇ శ్వేతశ్రీ, వర్క్ ఇన్స్పెక్టర్ మహేందర్, కాలనీ నేతలు ప్రహ్లాద్ గౌడ్, సురేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మ రక్షణ సభకు అన్ని వర్గాల వారు మద్దతు తెలపాలి: బిజెపి


ధర్మ రక్షణ సభకు మద్దతు పలికి రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డితో కలిసి సభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయీ బ్రాహ్మణులు

**సరూర్‌నగర్, జనవరి 17 ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో చొరబడి అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశీయులు, రోహిం గ్యాలను అరెస్టు చేసి వారి దేశాలకు తిప్పి పంపాలనే డిమాండ్‌తో జాగో భాగ్యనగర్.. ఛలో బాలాపూర్ నినాదం తో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సహకారంతో గణేష్ సేన నిర్వహణలో మహేశ్వరం నియోజకవర్గంలోని బాలా పూర్ గణేష్ చౌక్ వద్ద ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ధర్మ రక్షణ సభకు అన్ని వర్గాల నుండి మద్దతు పలకాలని బడంగ్‌పేట్-1 బిజెపి అధ్యక్షుడు రాళ్ళగూడెం రామ కృష్ణారెడ్డి కోరారు. ఈ నెల 24వ తేదీ శనివారం సభ జరుగనున్న నేపథ్యంలో రోహింగ్యాలు అక్రమంగా నివసి స్తున్న బాలాపూర్ తదితర ప్రాంతాలకు చెందిన నాయీ బ్రాహ్మణులు ఏకమై సభకు తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు రామకృష్ణారెడ్డిని కలిసి ఆయనతో పాటు సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాలు విచ్చలవిడిగా సంచ రించడమే కాకుండా కులవృత్తులు చేసుకునే స్థానికులపై ప్రభావం చూపుతున్నారని వెల్లడించారు. ఈ ధర్మయుద్ధా నికి నాయీ బ్రాహ్మణుల మాదిరిగా అన్ని వర్గాల వారు మద్దతు తెలపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో శ్రవణ్, మనోజ్, సతీష్, శివ, కృష్ణ, కార్తీక్, కుమార్, చైతన్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం: చైర్మన్ బాబు శ్రీనివాస్




**మలక్ పేట, జనవరి 17, ప్రభాతవార్త:**
ఓల్డ్ మలక్ పేటలోని శ్రీ పోచమ్మ దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని దేవాలయం చైర్మన్ బాబు శ్రీనివాస్, వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ లు పేర్కొన్నారు. దేవాలయం జరిగిన కార్యక్రమంలో దేవాలయం నూతన కమిటీ పోస్టర్ ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన కమిటీ ఆధ్వర్యంలో ప్రతి నెల చివరి శుక్రవారం నాడు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కావున భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవాలయం ధర్మకర్తలు మేధరి సునీత, రాజ్ కుమార్, తాటికొండ శ్యామ్, ఆలయ పూజారి శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.


ఉప్పల్ మినీ శిల్పారామంలో కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు దృశ్యం.

## 23 నుంచి 25 వరకు బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోటీలు : చైర్మన్ సామా ప్రభాకర్ రెడ్డి

**మలక్ పేట, జనవరి 17, ప్రభాతవార్త:**
దిల్ షుక్ నగర్ షటిల్ ప్లేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముసారాంబాగ్ డివిజన్ దిల్ షుక్ నగర్ షటిల్ కోర్టులో ఈ నెల 23 నుంచి 25 వరకు 21వ ఇన్విటేషనల్ రిపబ్లిక్ డే బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోటీలను నిర్వహించనునట్లు షటిల్ ప్లేయర్స్ అసోసియేషన్ చైర్మన్ సామా ప్రభాకర్ రెడ్డి, అధ్యక్షు డు గంగుల వెంకటేశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్. శ్రీధర్ రెడ్డి, కన్వీనర్ కరెడ్ల శ్రీనివాసరావు లు తెలిపారు. ఈ సంద ర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 19 ప్లస్, 35 ప్లస్, 50 ప్లస్ విభాగాలలో మెన్స్ డబుల్స్ టోర్న మెంట్లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జంట నగరాలకు చెందిన క్రీడాకారులు మెన్స్ డబుల్స్ టోర్నమెంట్ పోటీలలో పాల్గొనవచ్చునని వివరించారు. ఆసక్తి క్రీడాకారులు ఈ నెల 21వ తేదీ సాయంత్రం 6 గంటలలోగా విజయ్ (9866331280), శ్రీనివాసరావు (9848015443) నెంబర్లలో వాట్సాప్ లో సంప్రదించి క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకో వాలని కోరారు. పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు ప్రదమ స్థానంలో నిలిచిన వారికి రూ.8వేల నగదు బహుమతి ద్వితీ య స్థానంలో నిలిచిన వారికి రూ.5వేల బహుమతి, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ. 3 వేల నగదు బహుమతి అందజేయనున్నట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**టోర్నమెంట్ విజేతలుగా అనిల్ కుమార్, బాలు**

దిల్ షుక్ నగర్ షటిల్ ప్లేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దిల్ షుక్ నగర్ లోని షటిల్ కోర్టులో రెండు రోజులపాటు నిర్వ హించిన ఇంటర్నల్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోటీల లో అనిల్ కుమార్ బాలు మొదటి స్థానం సాధించి విజేతలు గా నిలిచారు. సింగిరెడ్డి శ్రీధర్ రెడ్డి, రాఘవేంద్ర ద్వితీయ స్థానం, ఏవీ రెడ్డి, చలపతిలు తృతీయ స్థానం సాధించారని దిల్ షుక్ నగర్ షటిల్ ప్లేయర్స్ అసోసియేషన్ చైర్మన్ సామా ప్రభాకర్ రెడ్డి, అధ్యక్షుడు గంగుల వెంకటేశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్. శ్రీధర్ రెడ్డి కన్వీనర్ కరెడ్ల శ్రీనివాసరావు తెలిపారు. ఇంటర్నల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో గెలుపొందిన క్రీడాకారులకు ఈనెల 25వ తేదీన బహుమతులను అంద జేయనున్నట్లు వారు వివరించారు.

## మహిళ మెడలోంచి గొలుసు చోరీ

**హయత్ నగర్, జనవరి 17 ప్రభాతవార్త:**
గుడికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న మహిళ మెడ లోంచి దుండగులు 3 తులాల బంగారు గొలుసును అపహరించుకుపో యిన సంఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరి గింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు... మన్సురాబాద్ డివిజన్ అంజనాద్రి నగర్ కు చెందిన చింతకుంట్ల విజయ, ఇంటి ఎదురుగా ఉండే మహంకాళి కృష్ణ కుమారి లు శనివారం ఉదయం 9 గంటల సమయంలో కాలనీ లోని ఆంజనేయ స్వా మి ఆలయానికి వెళ్లారు. పూజ అనంతరం వారు ఇంటికి తిరిగి వస్తుండగా పల్సర్ బైక్ మీద వచ్చిన ఇరువురు గుర్తు తెలియని దుండగులు విజయ మెడలోని 3 తులాల బంగారు గొలుసును లాక్కుని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బొడ్రాయి పండుగకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం



**నేరేడ్ మెట్, జనవరి 17,ప్రభాతవార్త:** నేరేడ్మెట్ గ్రామంలో నిర్వహించనున్న బొడ్రాయి పండుగ వార్షికోత్సవానికి మల్కాజ్ గిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి రూ.1,50,000/ ఆర్థిక సహాయం అందజేశారు. శుక్రవారం మల్కాజ్‌గిరి ఎమ్మె ల్యే క్యాంపు కార్యాలయంలో నేరేడ్మెట్ గ్రామ బొడ్రాయి కమిటీ పెద్దలు, మల్కాజ్‌గిరి మాజీ కార్పొరేటర్ ఎన్. జగదీష్ గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి పండుగ నిర్వహణకు సహకరించాలని వినతిపత్రం అందజేశారు. కమిటీ సభ్యుల అభ్యర్థనకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి వెంటనే పండుగ నిర్వహణ నిమిత్తం నగదు సహాయాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యే అం దించిన ఆర్థిక సహాయానికి బొడ్రాయి కమిటీ సభ్యులు కృతజ్ఞ తలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బొడ్రాయి కమిటీ సభ్యులు కావలి రమేష్ యాదవ్, ఈశ్వర్ గౌడ్, బళ్లారి అశోక్ ముదిరాజ్, తుపాకుల జనార్ధన్, చాగంటి రాజు గౌడ్, మిథిలేష్, నవీన్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు

### సమస్యలపై స్పందించిన డిసి.. క్షేత్ర స్థాయిలో పరిశీలన

**సరూర్‌నగర్, జనవరి 17 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి బడం గ్‌పేట్ సర్కిల్ కిందకు వచ్చే 59వ డివిజన్‌లోని వివిధ ప్రాంతా లకు సంబంధించిన ప్రజా సమస్యలపై ఇటీవల కాలనీ అసోసి యేషన్స్ ఫెడరేషన్ వినతి పత్రం అందజేసిన నేపథ్యంలో స్పందించిన డిప్యూటీ కమీషనర్ త్రిల్లేశ్వర్‌రావు శనివారం సమ స్యాత్మక ప్రాంతాల్లో పర్యటించారు. పలువురు అధికారులు, ఫెడరేషన్ ప్రతినిధులతో కలిసి ఆయన జిల్లెలగూడ గాయత్రీనగర్ రామాలయం టెంపుల్ వీధి డ్రైనేజీ సమస్యలు, గాయత్రీనగర్ చౌరస్తా నుండి కృష్ణ ఆసుపత్రి వరకు రోడ్డుకి రువైపులా ఆక్రమణలు తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ కార్యదర్శి వంటేరు నర్సింహారెడ్డి డిసికి సమస్యల గురించి వివరించారు. ఈ మేరకు వాటి పరిష్కా రానికి చర్యలు తీసుకోవాలని కోరగా డిసి సానుకూలంగా స్పందించారు. కాగా తమ విజ్ఞప్తి మేరకు పర్యటించి సమస్యల ను స్వయంగా పరిశీలించినందుకు ఆయన ఫెడరేషన్‌తో పాటు కాలనీ అసోసియేషన్లు, కాలనీవాసుల తరపున డిసి త్రిల్లేశ్వ ర్‌రావుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫె డరేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఆంజనేయులు, మల్లారెడ్డి, ప్రభాకర్‌రావు, వీరరాజు, విజయ్‌కుమార్, సత్యానా రాయణ, విష్ణు, ప్రశాంత్‌కుమార్, శ్రీధర్‌కుమార్, రామకృష్ణ, రంగయ్య చౌదరి, శ్రీనివాజులు, కార్తీక్‌రెడ్డి, సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

### జె.కె కాలనీలో ఆర్‌సీసీ పైప్‌లైన్ పనుల పరిశీలన



**నేరేడ్ మెట్, వినాయక్ నగర్, జనవరి 17:** వినాయక్ నగర్ డివి జన్ పరిధిలోని జె.కె కాలనీలో కొనసాగు తున్న ఆర్‌సీ సీ పైప్ లైన్ పనులను కార్పొ రేటర్ రాజ్యల క్ష్మి శుక్రవారం పరిశీలించారు. కాలనీవాసులకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, వేగవం తంగా పూర్తిచే యాలని సంబంధిత అధికారులకు ఆమె ఆదేశిం చారు. ఈ సంద ర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, మురు గునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు ఆర్‌సీసీ పైప్‌లైన్ పనులు కీలకమని పేర్కొన్నారు. పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచే సుకోకుండా పర్యవేక్షణ కట్టుదిట్టంగా ఉండాల ని సూచించారు. స్థానికుల నుంచి వచ్చిన సూచనలను పరిగ ణనలోకి తీసుకుని అవసరమైన చర్యలు తీసుకుంటామని భరో సా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ సాగర్, వెంక టేష్, సాయి సురే ష్, సుష్మ, మహేష్, బిట్టుతో పాటు బీజేపీ నాయకులు ఓం ప్రకాష్, జగదీష్, శ్రీనివాస్, నరేందర్ తదిత రులు పాల్గొని ప నుల పురోగతిని పరిశీలించారు. కాలనీ వాసులు కార్పొరేటర్ చొరవను అభినందిస్తూ త్వరితగతిన పను లు పూర్తిచేయాలని కోరారు.